




రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో పూజలు

వేడుకగా సత్యదేవుడి గిరి ప్రదక్షిణ





7

అన్నవరం సత్యదేవుడి గిరి ప్రదక్షిణ వేడుకగా సాగింది.. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి గిరి ప్రదక్షిణ నిర్వహించారు.. సుమారు 1.50 లక్షల మంది భక్తులు హాజరైనట్టు సమాచారం. శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ చేపట్టారు. మధ్యాహ్నం గిరిప్రదక్షిణ నిర్వహించగా సత్యరథం వెంబడి భక్తులు భారీగా కదిలారు. సత్యదేవుడి వెంట నడిచారు. కొండంతా సత్యదేవ నామ స్మరణతో మారుమ్రోగింది.. 9.2 కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ సాగింది.. స్వామి వెంట తొలుత ఎంత మంది ఉన్నారు.. గిరిప్రదక్షిణ ముగిసే సమయనికి అంతకు రెట్టింపు భక్తజనం తరలివచ్చారు.. రాత్రి పంపా హారతుల కార్యక్రమం కన్నుల పండువగా సాగింది.



కార్తీక సందడి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పుష్కరించుకుని గోదావరి ఘాట్లకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే కార్తీక స్నానాలను ఆచరించి దీపాలు వదిలారు. కోటిలింగాలరేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, మార్కండేయ ఘాట్, దోబిఘాట్ , సరస్వతి ఘాట్,గౌతమిఘాట్, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలకు శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు పోటెత్తారు. అనంతరం ఘాట్లలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. రేవులు కార్తీక దీప కాంతులతో వెలుగొందింది. భక్తులు రాజమహేంద్రవరంలో కుటుంబసమేతంగా పౌర్ణమి నోములను నోచుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు పెట్టుకున్నారు. హరహర మహాదేవ అంటూ భక్తితో శివయ్యను కొలిచారు.

ఫ్యాన్స్..గల్లంతు!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఫ్యాన్ గాలి మారింది..రెక్కలు ఒక్కొక్కటిగా ఎగిరిపోతున్నాయి.. జిల్లాలో వైసీపీ ఖాళీ అయిపోతుంది.. ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లో ఫ్యాన్ రెక్కలు విరిగిపడ్డాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి ఉంది. అవకాశం వస్తే జారుకునేందుకు నేతలు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వైసీపీ డీలా పడింది. ఎన్నికల తర్వాత అనేక మంది వైసీపీని వీడిన సంగతి తెలిసిందే.అయితే ఇప్పటి వరకూ జిల్లాలో చోటా మోటా నాయకులే కూటమి బాట పట్టారు. గురువారం ఏకంగా ప్రముఖ పారిశ్రా మిక వేత్త,గత వైసీపీ ప్రభుత్వంలో సలహాదా రు గా వ్యవహరించిన ఎస్.రాజీవ్‌కృష్ణ టీడీపీలో చేరడంతో అంచనాలు తారుమారయ్యాయి. స్థానిక ఎన్నికలు వచ్చేలోపు వైసీపీ ఖాళీ అయిపోతుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

కూటమి వైపు.. వైసీపీ నేతల క్యూ

- కూటమిలో చేరేందుకు సిద్ధం
- టచ్‌లో ఉంటున్న వైసీపీ నేతలు
- కొవ్వూరు, నిడదవోలులో షాక్
- అనపర్తిలోనూ పెరిగిన చేరికలు
- అదే బాటలో మరికొందరు
- నిడదవోలులో జనసేన వైపు?
- తూర్పున ఫ్యాన్ పని ఖాళీ

వైసీపీ నుంచి క్యూ

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైసీపీలో వివిధస్థాయిల్లో పనిచేసిన నేతలు తెలుగు దేశం, జనసేన, బీజేపీల్లో చేరడానికి అనేక ప్రయ త్నాలు చేస్తున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో స్థానికంగా నెలకొన్న రాజకీయాల వల్ల కూట మిలో నేతలే అంగీకరించని పరిస్థితి ఉంది. అయితే ఇప్పటికీ ఆయా నేతలు టచ్‌లో ఉన్నట్టు సమాచారం. కొవ్వూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే దివంగత పెండ్యాల కృష్ణబాబు అల్లుడైన ఎస్.రాజీవ్‌కృష్ణ టీడీపీలో చేరడంతో ఇక వైసీపీ పరిస్థితి ఏంటనేది చర్చనీయాంశమైంది. ఆయనతో పాటు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పార్టీ మారడంతో కార్యకర్తలు కూటమి వైపే చూస్తున్నారు. రాజమహేంద్రవరంలో 2014లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన బొమ్మన రాజ్‌కుమార్ తనయుడు బొమ్మన జయకుమార్ కొద్ది నెలల కిందటే టీడీపీలో చేరడంతో పాటు జాంపేట కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ చైర్మన్‌గా కూడా ఎన్నికయారు.అంతకుముందు చల్లా శంకరరావు కూడా కూటమి మద్దతుతో ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ అయిన సంగతి తెలిసిందే. అనపర్తి నియోజకవర్గంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆ నియోజకవర్గంలోనూ పార్టీ అంతంత మాత్రంగానే ఉంది. గోకవరం జడ్పీటీసీ దాసరి శ్రీరంగ అధికారికంగా టీడీపీలో చేరకపోయి నప్పటికీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతోనే కలసి ఉంటున్న సంగతి తెలిసిందే. కోరుకొండ మండలంలోని కాపవరం సర్పంచ్‌జాజుల రాము టీడీపీలో చేరారు. దేవరపల్లిలో వైసీపీ నేత మాధవరపు వెంకటేశ్వరరావు జనసేనలో చేరారు. పోతుల కనకరాజు జన సేనలో చేరారు. అదే బాట లో కొవ్వూరు, నిడదవోలు మునిసిపల్ చైర్మన్లు ఉన్నా రు. ఇంకా చాలా నియోజకవర్గాల నుంచి వైసీపీ నేతలు టీడీపీలో చేరే ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు నేతలు గాంభీర్యత ప్రదర్శిస్తున్నప్పటికీ వారికి ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే ఇంకా వైసీపీ గురించి మాట్లాడుతున్నారనే చర్చ కూడా మొదలైంది. వైసీపీ వైఖరికి విసిగి పోయిన ప్రజలు జగన్, వైసీపీకి ఇక భవిష్యత్ లేదనే వాదన చేస్తున్నారు. ఎన్నికల తర్వాత జిల్లావ్యాప్తంగా కొందరు మౌనంగా ఉండిపోయారు. సుమారు ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలు దిశగా ముందుకు వెళ్లడంతో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది.ఈ నేపథ్యంలో ఇక తమకు రాజకీయ భవిష్యత్ ఉండదనే కారణంతో పలువురు వైసీపీ నేతలు కూటమి వైపు చూస్తున్నారు. అయితే స్థానిక కూటమి నేతలు మాత్రం తమకు తెలియకుండా చేరికలు జరుగుతుండడంపై కినుక వహిస్తున్నారు.గత సంఘటనల నేపథ్యంలో సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

నిడదవోలులోనూ వైసీపీకి షాక్

- పార్టీకి 11 మంది రాజీనామా
- చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు
- జిల్లా అధ్యక్షుడికి లేఖలు
- జనసేనలో చేరేందుకు సిద్ధం?
- పెరగనన్ను జనసేన బలం


చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు నియోజకవర్గంలోనూ వైసీపీకి షాక్ తగిలింది. నిడదవోలు మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,మరో తొమ్మిది మంది కౌన్సిలర్లు శుక్రవారం సాయంత్రం వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు పంపారు. వివిధ కారణాల వల్ల తామంతా వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామని ఆమోదించాలని తమ లేఖ ద్వారా విన్నవించారు. అయితే తర్వాత ఏ పార్టీలో చేరుతున్నది వెల్లడించలేదు. జనసేనలో చేరనున్నట్టు సమాచారం. నిడదవోలు 25 వార్డు కౌన్సిలర్ మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, 4వ వార్డు కౌన్సిలర్ మునిసిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, 3,7,9,10,11,18,23,24,28 వార్డుల కౌన్సిలర్లు వరుసగా ఎమ్.డి.షాజీరాబేగం, ముంగంటి మాణిక్యమాల, ఉసురుమర్తి జాన్ బాబు,ఆరుగొల్లు వెంకటేశ్వర్లు,చిలకల శారదా దేవి,సైదు చంద్రశేఖర్,మద్దిపాటి నాగశ్రీ, మానుపాటి లక్ష్మి, ఆకుల ముకుందరావు తమ రాజీనామా లేఖలను జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణకు పంపారు. వైసీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు విధానాలతో గత కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న మునిసిపల్ చైర్మన్ మరి కొందరు కౌన్సిలర్లు వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆంధ్రజ్యోతి ముందే కథనం ప్రచురించింది. ఇప్పుడు అదే నిజమైంది. మునిసిపల్ పాలకవర్గం వైసీపీని వీడడంలో జనసేన నాయ కుడు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కీలకపాత్ర పోషిం చినట్టు సమాచారం. త్వరలోనే మిగిలిన వైసీపి కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసే దిశగా ప్రణా ళిక సిద్ధం చేసినట్టు తెలిసింది.

కౌన్సిల్‌లో తగ్గిన వైసీపీ బలం

నిడదవోలు పురపాలక సంఘానికి 2021లో ఎన్నికలు జరగ్గా 27 వార్డుల్లో వైసీపీ అభ్యర్థులు ఒక వార్డులో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో 27 మంది సభ్యులు ఉన్న వైసీపీలో నేడు 11 మంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేయడంతో 16 మందికి వైసీపీ బలం పడిపోయింది. త్వరలో మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు రాజీనామా బాట పట్టనుం డడంతో అతి త్వరలోనే నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ జనసేన పార్టీ కైవసం చేసుకోనుంది.


మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణు

కూటమిలో చేరితే పదవులకు రాజీనామా చేయాలి : వైసీపీ

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీ పీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు తమ పదవులకు రాజీనామాచేయాలని వైసీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీని వీడిన వారంతా వైసీపీలో ఉంటూ గత ఎన్నికల్లో టీడీపీకి పని చేశారని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రాజీవ్‌కృష్ణ ప్రభుత్వ సలహాదారుడిగా ఉండి పార్టీని వీడి వెళ్లడం ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఏ కారణాలతో రాజీవ్ కృష్ణ పార్టీని వీడారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.ఈకార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, యు. సురిబాబు, పి. శ్రీలేఖ, ఎన్. శ్రీనివాస్, జి. సాయి, వి. సూరిబాబు,ఆలీ తదితరులు పాల్గొన్నారు.

షోలాపూర్ ఉల్లి వచ్చినా..లొల్లి!

- మహారాష్ట్ర ఉల్లి నో స్టాక్
- కొత్త ఉల్లి ధరలకు రెక్కలు
- మార్కెట్లో కిలో రూ.80 పైనే
- భారీగా పెరుగుతున్న రేట్లు
- సామాన్యుల బెంబేలు



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర పాత ఉల్లిపాయలు మార్కెట్‌లో దొరకడంలేదు. హోల్‌సేల్ ట్రేడర్లు నో స్టాక్ అని చెబుతున్నారు. రేటు ఎంతైనా కొందామని ప్రయత్నిస్తున్నా చాలా మంది ఎగువ మధ్యతరగతికి ఇవి అందుబాటులో లేకుండా పోయాయి. మహారాష్ట్ర నుంచి సరుకు రావడం లేదని, లారీలు ఎప్పుడొస్తాయో తెలియదని ఇక్కడి ట్రేడర్లు చేతులెత్తేస్తున్నారు.ఒకరిద్దరు హోల్‌సేల్ ట్రేడర్లు ధైర్యం చేసి రెండు, మూడు లారీలు రప్పిస్తున్నా వాటిని సెమీహోల్‌సేల్,సూపర్ మార్కెట్లు హాట్‌కేకుల్లా పట్టుకుపోతున్నారు. మధ్యతరగతి ప్రజలకు అందనీయడంలేదు. దీంతో షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలకు సెమీ హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఈ రకం ఉల్లి ఏ మాత్రం నిల్వ ఉండకపోయినా ధర మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా ఉంది. నాణ్యత అంతంతమాత్రంగా ఉండి, నిల్వకు ఏ మాత్రం పనికిరాని షోలాపూర్ రకం ఉల్లిపాయలను హోల్‌సేల్‌లోనే కిలో రూ.45 నుంచి రూ.50ల వరకూ విక్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక సూపర్‌మార్కెట్లు, సెమీ హోల్‌సేల్ వ్యాపారుల వద్ద అరకొరగా దొరికే పాత ఉల్లిపాయలు కిలో రూ.80పైనే విక్రయిస్తున్నారు. దీంతో బహిరంగ మార్కెట్లో ఉల్లి ధరలు సామాన్యులతో పాటు మధ్యతరగతి వర్గాలను బెంబేలెత్తిస్తున్నాయి. రైతు బజార్లలో ఉల్లిపాయలు కిలో రూ.32లకు విక్రయిస్తున్నారు. కొంతమంది కర్నూలు రకం,మరికొందరు షోలాపూర్ ఉల్లిపాయలు విక్రయిస్తున్నా రు. ఇవి చాలా నాసిరకంగా ఉంటున్నా సామాన్య ప్రజలకు మరోదారి లేక కొనుగోలు చేస్తున్నారు.

కార్తీకమాసంలోనూ ఇలాగెందుకు..

దీపావళి తర్వాత మార్కెట్లోకి మహారాష్ట్ర కొత్త ఉల్లిపాయలు వస్తాయని, దీంతో ధరలు తగ్గుతాయని హోల్‌సేల్ ట్రేడర్లు చెబుతూ వచ్చారు. అనుకున్నట్లే షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఇదే సమయంలో కర్నూలు ఉల్లిపాయలు వచ్చినా మార్కెట్‌పై ఏ మాత్రం ప్రభావం చూపించలేదు. పరిస్థితి తారుమారైంది. మహారాష్ట్ర నాసిక్‌రకం పాత ఉల్లిపాయలు మార్కెట్‌కు రాకపోవడంతో నిల్వకు ఏ మాత్రం పనికిరాని షోలాపూర్ ఉల్లి ధరలు టాప్ రేటులో ఉన్నాయి. ట్రేడర్ల అంచనాలకు భిన్నంగా ధరలు మరింత పెరగడం ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఉల్లి వినియోగం గణనీయంగా తగ్గుతుందని భావించినా ఆ పరిస్థితి కనిపించడంలేదు. ధరలు ఏ మాత్రం దిగిరావడంలేదు. ఈ పరిస్థితి ఎన్నాళ్లు ఉంటుందనే దానిపై హోల్‌సేల్ ట్రేడర్లు సైతం చెప్పలేకపోతున్నారు. దీంతో సామాన్యులు, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఉల్లిపాయలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

మహిళల రక్షణకు ప్రత్యేక టీమ్‌లు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

గోకవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో మహిళలు,చిన్న పిల్లల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ.అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా గోకవరం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఉమెన్, మేల్ కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీమ్‌లను మహిళల రక్షణకు ఏర్పాటు చేశామన్నారు.ఏజెన్సీ ముఖద్వారం తూర్పు గోదావరి జిల్లా ఉండడంతో గంజాయి అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందన్న సమాచారం ఉందన్నారు.గంజాయి అక్రమ రవాణా నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. సోషల్ మీడియా ద్వారా అసభ్యకరమైన పోస్టులు పెడితే ఊరుకునేది లేదన్నారు. రేంజ్ పరిధిలో ఉన్న ఆరు జిల్లాల్లో ఇప్పటి వరకు సుమారు 60 వేల నుంచి 70 వేల వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మరో 30 వేల కెమెరాలు ఏర్పాటు చేస్తే కేసుల్లో మంచి పురోగతి లభించే అవకాశం ఉంటుందన్నారు. నిందితుల ముఖాలను గుర్తు పెట్టే కెమెరాలు త్వరలో రానున్నాయని, వాటి వల్ల కూడా పోలీస్ వ్యవస్థకు మరింత మేలు జరగనుందన్నారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గోకవరం ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పునఃప్రారంభించారు. ఎస్ఐ పవన్ కుమార్ నుంచి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దేవిచౌక్ సెంటర్‌లో కనకదుర్గ అమ్మవారిని ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఆయన వెంట ఏఎస్పీ సుబ్బరాజు,సీఐ వై.సత్యకిషోర్ ఉన్నారు.


గోకవరంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

రేషన్ బియ్యం పక్కదారి!



కోళ్ల ఫారాలకు తరలింపు

- రెండు చోట్ల సాగుతున్న దందా
- మామూళ్ల మత్తులో అధికారులు
- చూడనట్టు వదిలేస్తున్నవైనం

నిడదవోలు, నవంబరు 15 (అంధ్రజ్యోతి) : పౌరసరఫరాల శాఖ మంత్రి ఎంత ప్రయత్నించినా రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉన్నాయి. ఎందుకంటే అన్నీ తెలిసినా అధికార యంత్రాంగం కళ్లు మూసుకుని ఉండడమే. గ్రామాల్లో బియ్యం ఎవరెవరు కొంటారు.. ఎక్కడికి తరలిస్తారనేది జనమెరిగిన సత్యం.. అయినా అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. గ్రామాల్లో పదుల సంఖ్యలో సచివాలయ సిబ్బంది ఉన్నా పక్కదారి పట్టడాన్ని ఆపలేకపోతున్నారు. రేషన్ బియ్యం చాలా మంది ఇంట్లో వినియోగించడానికి ఇష్టపడరు. ఈ నేపథ్యంలో అయిన కాడికి అమ్ముకుని సొమ్ములు చేసుకుంటు న్నారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం ఇవ్వడానికి కేజీకి రూ.43లు ఖర్చు చేస్తుంటే ప్రజలు మాత్రం కేజీ రూ.17లకు విక్రయించడం గమనార్హం. కొన్ని వేల టన్నుల బియ్యం మళ్లీ ఏమవుతున్నాయోనని ఆరాతీస్తే అసలు విషయం బయటపడింది. కొందరు ఈ ఉచిత బియ్యం కొనుగోలు చేసి అధిక ధరలకు కోళ్ల ఫారంలకు విక్రయించేస్తున్నారు. పేదల బియ్యం పక్కదారి పడుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తయినా చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు రేషన్ బియ్యం దందాను కుటీర పరిశ్రమగా మార్చేసి కొనుగోళ్లను యథేచ్ఛగా సాగించేస్తున్నారు.

దళారుల కొనుగోళ్లు..

జిల్లాలో ప్రతినెలా 1వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఎండీయూ వాహనాల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు ఉచితంగా ప్రభుత్వం బియ్యం పంపిణీ చేస్తుంది. కుటుంబంలో ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. సుమారు ఒక్కో కుటుంబానికి 20 కిలోలలోపుగా బియ్యం పంపిణీ జరుగుతుంది. తెల్లరేషన్ కార్డుదారుల్లో ఎక్కువ మంది రేషన్ బియ్యాన్ని వినియోగించరు. తెల్లరేషన్ కార్డు ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం కావడంతో తప్పని పరిస్థితుల్లో బియ్యం తీసుకుంటున్నారు. దీంతో కొందరు రేషన్ బియ్యాన్ని తెల్లరేషన్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించేస్తున్నారు. నిడదవోలు మండలంలోని సూరాపురం, చాగల్లు మండలంలోని కలవలపల్లి ఇలా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో కొందరు రేషన్ బియ్యం కొనుగోలు విక్రయాలను కుటీర పరిశ్రమగా నిర్వహిస్తున్నారు. ఉచితంగా వచ్చే రేషన్ బియ్యం కిలో 17 రూపాయల చొప్పున కొనుగోలు చేసిన అక్రమార్కులు కిలో రూ.23లకు కోళ్ల ఫారాలకు, కొన్ని రైస్ మిల్లులకు విక్రయించేస్తున్నారు. కోళ్ళ ఫారా ల్లో కోళ్లకు ఆహారమైన నూక ధర పెరిగి ఎక్స్‌పోర్ట్‌కు వెళ్లిపోవడంతో కొందరు యజమానులు రేషన్ బియ్యం కొనుగోలుకు తెరలేపారు. ప్రతి నెలా మొదటి 15 రోజులు రేషన్ బియ్యం కొనుగోలు చేసిన వారు మూటలు కట్టుకుని మోటారు సైకిళ్లపై కోళ్ల ఫారమ్‌లకు తరలించేస్తున్నారు. రేషన్ బియ్యం కోళ్ల ఫారమ్‌కు చేరిన క్షణాల్లోనే నూకగా మారిపోతుండడంతో విక్రయించే వారికి కొనుగోలు చేసే వారికి ఎటువంటి సమస్యలు తలెత్తడం లేదు. రేషన్ బియ్యం కొనుగోలు చేసే దళారులు అధికారులకు ఎప్పటికప్పుడు మామూళ్లు ఇస్తున్నట్టు సమాచారం. అందుకే అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

24న బీవీఆర్ ప్రమాణస్వీకారం 6
కేన్సర్ తట్టుకోలేక మహిళ ఆత్మహత్య 7



గోదారంతా జనం : కిటకిటలాడిన రాజమహేంద్రవరం పుష్కరఘాట్



రాజమహేంద్రవరం గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళ



పోటెత్తిన భక్తజనం : ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో భక్తుల క్యూ

నోము పండించవా స్వామి: కార్తీక నోములకు స్వయంపాక దానాలతో ఆలయాలకు చేరుకున్న నవ వధువులు



సామర్లకోట భీమేశ్వరాలయంలో..



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో..



ఐ.పోలవరం వీరేశ్వరస్వామి ఆలయంలో..



పాదగయ క్షేత్రంలో పున్నమి కాంతులు



చూడు..స్వామి : ప్రత్యేక అలంకరణలో సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి

శివయ్యా.. చూడయ్యా

- కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూరదీపం..అంటూ భక్తులు దీపాలు వదిలారు.. నీ నోము నోచుకుంటున్నాం.. మమ్మల్ని చల్లంగ చూడు స్వామి అంటూ భక్తులు మొక్కు కున్నారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలు.. గోదావరి రేవులు భక్తజనంతో కిటకిటలా డాయి.. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యక్షేత్రాలు, నదీతీరాలకు చేరుకున్నారు.. ఆకాశంలో చుక్క కనుపడుతుం డగానే దీపాలు వదలాలని..తెల్లవారుజామునే ఆకాశానికి చూపిస్తూ కార్తీక దీపాలు విడిచిపెట్టారు.. శైవక్షేత్రాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి తీరంతోపాటు పిఠాపురంలోని కోనేరు, సామర్లకోట, ద్రాక్షారామల్లోని భీమేశ్వరాలయాల్లో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. బ్రాహ్మణులకు దీపదానం చేశారు.. శక్తిమేరకు స్వయంపాకం ఇచ్చారు. కార్తీక నోము సందర్భంగా ఆయా ఆలయాల్లో నూతన వధువులు కందపిలకలు.. పసుపు మొక్కలతో కూడిన స్వయంపాక దానాలతో కనిపించారు.



వరరామచంద్రాపురం మండలం రేఖపల్లి శివాలయంలో దీపారాధన



సామర్లకోటలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న భక్తజనం



భక్తజనంతో నిండిన కొవ్వూరు గోష్పాదక్షేత్రం



పిఠాపురం పాదగయలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తజనం





గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం ఆలయ శిఖరంపై దర్శనమిస్తున్న పౌర్ణమి చంద్రుడు.. (ఇన్‌సెట్‌లో) పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆలయ శిఖరంపై పౌర్ణమి చంద్రుడు

ఆలయ శిఖరాన పౌర్ణమి చంద్రుడు

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయ శిఖరాలపై పౌర్ణమి చంద్రుడు దర్శనమిచ్చాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో రాజగోపురం, ఆలయ శిఖరంపై చంద్రుడు దర్శనంతో భక్తులు భక్తతన్మయత్వంతో తిలకించి పూజలు చేశారు. కార్తీకపౌర్ణమి రోజున చంద్రదర్శనం కావడంతో భక్తులు పులకించారు. ఏటా కార్తీకపౌర్ణమికి ఆలయ శిఖరంపైకి చంద్రుడు వస్తాడని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు తెలిపారు. పాదగయ క్షేత్రంలోని ఆలయ శిఖరంపై పౌర్ణమి చంద్రుడు నిండుగా దర్శనమిచ్చాడు.



వృద్ధులకు.. ఆర్టీసీ రాయితీ

60 ఏళ్లు దాటితే 25 శాతం వర్తింపు

- ఆరు రకాల గుర్తింపు కార్డులు
- రాష్ట్రాలతో సంబంధం లేదు
- ఏ రాష్ట్రమైనా అమలు
- డిజిటల్ గుర్తింపు కార్డుకు ఓకే
- విడుదలైన ఉత్తర్వులు
- సీనియర్ సిటిజన్స్ ఆనందం

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటి జన్స్‌కు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) గుడ్‌న్యూస్ చెప్పింది. 25 శాతం రాయితీ అమలుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ అమలుకు ఆరు రకాల గుర్తింపు కార్డులను ప్రకటించింది. వాటిలో ఏఒక్కటి చూపించినా 25 శాతం సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. రాష్ట్రంతో సంబంధం లేకుండా ఏ రాష్ట్రానికి చెందిన సీనియర్ సిటిజన్స్‌కైనా ఈ రాయితీ వర్తింపచే యాలని ఏపీఎస్ఆర్టీసీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

డిజిటల్ గుర్తింపు కార్డుకూ ఓకే..

సీనియర్ సిటిజన్స్ తమ వయస్సుకు సంబంధించిన హార్డ్ కాపీలు లేదంటే సాఫ్ట్‌కాపీల్లో ఏవి చూపించినా వాటిని అనుమతించాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ నిర్వహించే అన్ని రకాల బస్సుల్లో 60ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్స్‌కు కార్పొరేషన్ 25శాతం రాయితీని పొడిగించిందని ఆదేశాల్లో పేర్కొన్నారు.ఇంకా టికెట్ కొనుగోలు సమయం, వారి ప్రయాణ సమయంలో సీనియర్ సిటిజన్ నుంచి భౌతిక రూపంలో లేదా డిజిటల్ రూపంలో (హార్డ్ కాపీ లేదా సాఫ్ట్ కాపీలు) వయస్సుకు సంబంధించిన ప్రభుత్వ గుర్తింపు కార్డులను చూపిస్తే సరిపోతుంది. సీనియర్ సిటిజన్స్ బస్సుల్లో 25 శాతం రాయితీని పొందడానికి ఆరు రకాల కార్డుల్లో ఏదైనా ఉపయోగించుకోవచ్చని ఆదేశాల్లో పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారు.ఆధార్, ఓటరు కార్డు, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డ్, పాస్‌పోర్టు, పాన్ కార్డు,రేషన్‌కార్డులను అనుమతించాలని సూచించారు.

ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమే

సీనియర్ సిటిజన్స్‌కు 25శాతం రాయితీని ఆర్టీసీ ప్రకటించింది. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఆరు రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపించి నిర్ధారించుకోవాల్సి ఉం టుంది. గుర్తింపుకార్డులు భౌతికంగా చూపించినా, ఫోన్‌లో చూపించినా అనుమతిస్తాం.
-మనోహర్, ఆర్టీసీ డీఎం, కాకినాడ

24న రుడా చైర్మన్‌గా బీవీఆర్ ప్రమాణస్వీకారం

రాజమహేంద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) చైర్మన్‌గా నియమితుడైన సీనియర్ టీడీపీ నేత, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి (బీవీఆర్ చౌదరి) ఈనెల 24వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ రోజు ఉదయం రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో కలిసి మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. అంతకు ముందు రుడా చైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చినందుకు లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.తన బాధ్యతలు స్వీకరణ గురించి కూడా వివరించారు.



లోకేశ్‌కు మొక్కను అందజేస్తున్న బీవీఆర్

'పోసానిని అరెస్టు చేయాలి'

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళీని అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.దేవరపల్లి మూడురోడ్ల సెంటర్ వద్ద ఆందోళన చేసి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుబ్రహ్మణ్యానికి వినతి పత్రం అందజేశారు.పోసాని అరెస్టు చేయాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనిల్, నల్లజర్ల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీచౌదరి ఉప్పులూరి రాంబాబు, కాకర్ల జగదీష్,బళ్లా సూర్యచక్రం,అడబాల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



వారింట..దీపం పెడుతున్నారు!

పిఠాపురం ఒత్తులు.. దేశమంతటా వెలుగులు..

కార్తీక మాసం కావడంతో లక్షలాది మంది భక్తజనం.. గోదావరి రేవులు.. శివాలయాలు.. ఉసిరి చెట్టు.. ఇలా ప్రతి పుణ్య ప్రదేశంలో పెద్ద ఎత్తున దీపాలు పెడుతుంటారు.. ఏదో ఒక షాపుల్లో ఒత్తులు కొనుగోలు చేస్తారు.. ప్రమిదలో నూనె వేసి వెలిగించేస్తారు.. అయితే ఆ ప్రమిదలో వెలుగుతున్న ఒత్తు ఎక్కడి నుంచి వస్తుందో మాత్రం ఎవరికి తెలియదు.. ఆ ఒత్తులు వచ్చేది మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం నుంచే.. ఒత్తుల తయారీనే వేలాది మంది మహిళలకు జీవనాధారం.కొన్ని గ్రామాల్లో ఏ ఇంటికి తలుపు తట్టినా ఒత్తులు చేస్తూ కనిపిస్తారు.. ఎందుకంటే వారింట దీపం పెట్టేది ఆ ఒత్తులే మరి..

- వేలాది మందికి ఒత్తులే ఆధారం!
- తయారీకేంద్రంగా పిఠాపురం
- ఒత్తులే కదా అని తీసిపారేయవద్దు
- కోట్లలో సాగుతున్న వ్యాపారం
- ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు



పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూరదీపం..కార్తీక మాసం వచ్చిందంటే దీపాలదే ప్రత్యేకం.. మహిళలు నిష్ఠగా తెల్లవారుజామునే నదుల్లో దీపాలు వదిలి పూజిస్తారు.. ఆ దీపాల్లో ఒత్తులు ఎక్కడి నుంచి



వస్తున్నాయంటే టక్కున చెప్పడం కష్టమే. ఎందుకంటే దీపాలు వెలిగించడం తప్ప.. ఒత్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయనేది ఆలోచించరు. ఈ ఒత్తుల తయారీ కేంద్రంగా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉంది. సాధారణ పువ్వు ఒత్తుల నుంచి లక్ష ఒత్తుల కుందె, కోటి వత్తుల దిండు కూడా తయారు చేస్తారు. ఒత్తుల్లోనూ పలు రకాలున్నాయి. ప్రమిదల్లో ఒత్తులను ఉంచి దీపాలను తయారు చేస్తున్నారు.

వేలాది మహిళలకు ఉపాధి

పిఠాపురం నియోజకవర్గం ఒత్తుల తయారీ కేంద్రంగా ఉంది. గొల్లప్రోలు పట్టణంలో 1500 మంది మహిళలు,పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని బి.ప్రత్తిపాడు, బోగాపురం, విరవ, విరవాడ, చేబ్రోలు, చెందుర్తి, తాటిపర్తి సహా మరో 20 గ్రామాల్లో మరో 2,500 మంది మహిళలు ఒత్తుల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరు మహిళలు సొంతంగా ఇంటి వద్దే ఒత్తులు తయారు చేస్తున్నారు.వీళ్ల స్థానికంగా అమ్మకాలు చేపడతారు. మరికొందరు స్థానికంగా ఒత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసిన వ్యాపారుల వద్దకు వెళ్లి పనిచేస్తున్నారు. ఈ వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు సైతం ఒత్తులను హోల్‌సేల్‌గా ఎగుమతి చేయడం గమనార్హం. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కర్నాటక, గోవా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. గొల్లప్రోలుతోపాటు పిఠాపురం నియోజకవర్గం మొత్తం మీద కోట్లలో వ్యాపారం జరుగుతూ ఉంటుంది.

టన్ను దారం రూ.1.50 లక్షలు

ఒత్తుల తయారీకి వినియోగించే దారం తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి వస్తోంది. అక్కడ టన్ను దారాన్ని రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకూ కొనుగోలు చేస్తారు. అత్యంత నాణ్యత కలిగిన దారం రూ.1.50 లక్షల వరకూ ఉంది. ఇలా తెచ్చిన దారాన్ని యంత్రాల సహాయంతో వడికి ఒత్తులకు అనుగుణంగా తయారు చేస్తారు. వీటిని మహిళలు ఒత్తులుగా తయారు చేస్తారు. తయారీ యూనిట్ల నిర్వాహకుల నుంచి ఈ దారాన్ని తీసుకుని ఇళ్ల వద్ద ఒత్తులు తయారు చేసి ఇస్తారు. కొందరు వ్యాపారులు తమ వద్దే ఒత్తులను తయారు చేయిస్తున్నారు. సాధారణంగా దీపంలో ఒకటి లేదా మూడు ఒత్తులు వినియోగిస్తారు. వీటితో పాటు 365 వత్తులు, 1008 ఒత్తులు, 10008 ఒత్తులు, లక్ష ఒత్తుల కుందె, కోటి ఒత్తుల దిండును తయారు చేస్తారు. వత్తుల్లో పువ్వొత్తులు, అయ్యప్ప ఒత్తులు, శివ సహస్రనామ ఒత్తులు, శివ జ్యోతులు, శివ ఢమరుకం ఒత్తులు, అఖండ ఒత్తులు, ఆకాశ దీపాలు తదితర రకాలున్నాయి. మహిళలు చేతితో మాత్రమే తయారు చేయగల పువ్వు ఒత్తులకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఆలయాల్లో వీటి వినియోగం ఎక్కువ. చేతితోనే చేయాల్సి ఉండడంతో స్థానిక మహిళలకు ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటారు.

రకరకాల ఒత్తులు..

కోటి ఒత్తుల దిండు మూడు కిలోల నుంచి 18 కిలోల బరువు ఉంటుంది.18 కిలోలు ఉన్న కోటి ఒత్తుల దిండును రూ.3 వేల నుంచి రూ.4,500 వరకూ విక్రయిస్తారు. సాధారణ 3-4



కిలోల కోటిఒత్తుల దిండు ధర రూ.500 నుంచి రూ.600 వరకూ ఉంటాయి. మిగిలిన వాటి ధరలకు వాటి నాణ్యత, సంఖ్య ఆధారంగా ఉంటుంది.దారం ఒడికి తయారు చేసిన ఒత్తులను ప్రమిదల్లో ఉంచి నెయ్యి లేదా దీపం నూనె వేసి ప్యాకింగ్ చేస్తారు. 365 ఒత్తులతో తయారు చేసే దీపం ప్రమిదకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.కోటి ఒత్తుల దిండు, లక్ష ఒత్తుల కుందెలను ఆర్డర్‌పై తయారు చేయించుకుంటారు. ప్రమిదల్లో ఒత్తుల పెట్టి తయారు చేసిన దీపాలకు ఇతర రాష్ట్రాల్లో అధికంగా డిమాండ్ ఉంది.

కిలో ఒత్తుల తయారీకి రూ.150



ఇంట్లో పనులు పూర్తి చేసుకుని ఒత్తులను తయారు చేస్తాం. కిలో పువ్వు ఒత్తులను తయారు చేసి ఇస్తే రూ.150 ఇస్తారు. ఇంట్లో పనిని బట్టి ఒత్తులు తయారీ ఆధారపడి ఉంటుంది. నాతో పాటు పలువురు మహిళలు ఇళ్లవద్దే ఒత్తులు తయారు చేస్తున్నారు. దీనివల్ల అదనపు ఆదాయం వచ్చి కుటుంబ పోషణలో ఉపయోగపడుతోంది. మా కుటుంబంలో ఇతర ఖర్చులకు సరిపోతాయి.
- రంగనాథం చంద్రకాంతం, ఈబీసీ కాలనీ, గొల్లప్రోలు

ఇక్కడ ఒత్తులకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్



మన దగ్గర తయారయ్యే ఒత్తులకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉంది.ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటారు. పువ్వు ఒత్తులతో పాటు 365 ఒత్తులు, 1008 ఒత్తులు, లక్ష ఒత్తుల కుందె, కోటి ఒత్తుల దిండులకు డిమాండ్ ఎక్కువ. ప్రమిదల్లో ఒత్తులు పెట్టి తయారు చేసే దీపాలను అధికంగా కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఎక్కువమందికి ఉపాధి లభిస్తుంది. **-మురాలశెట్టి బాబు, యూనిట్ నిర్వాహకుడు**

వేడుకగా గిరిప్రదక్షిణ

- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీ సేవ
- మధ్యాహ్నం సత్యరథం వెంబడి పాల్గొన్న లక్షా50వేలమంది

అన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువైన రత్న, సత్యగిరిలు శుక్రవారం జై సత్యదేవ నామస్మరణతో మార్మోగిపోయింది. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన స్వామివారి గిరిప్రదక్షిణకు రాష్ట్ర నలుమూలలనుంచి లక్షా50వేల మంది విచ్చేయడంతో రోడ్డంతా భక్తులతో నిండిపోయింది.

ఈ ఏడాది నూతనంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను ఉదయం 8గంటలకు పల్లకిలో, సత్యరథం భక్తులతో మధ్యాహ్నం రెండు గంటలకు గిరియాత్ర ప్రారంభించారు. ఉదయం 7.30 గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకిలో మెట్లమార్గం గుండా కొండదిగువన తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ స్వామి వారి పల్లకీ సేవ ద్వారా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లను పల్లకిలో పండితుల మంత్రోచ్చారణలతో స్వల్పంగా హాజరైన భక్తులతో ఈ గిరియాత్ర తొలిపావంచా నుంచి జాతీయ రహదారి మీదుగా బెండపూడి సమీపంలో పుష్కరకాలువ రోడ్డుగుండా 9.2 కిలోమీటర్లమేర గిరిప్రదక్షిణ సాగింది.



గిరిప్రదక్షిణలో సత్యరథం

గోవిందనామ స్మరణతో గిరిప్రదక్షిణ

మధ్యాహ్నం సత్యరథం ద్వారా ప్రదక్షిణకు భక్తులు సత్య, రత్నగిరికొండల వెంట నడిచారు. కొండలు, గుట్టలు దాటుకొని గోవిందనామ స్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. లక్షా 50వేలమంది వరకు హాజరయ్యారు. దేవస్థానం, దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్ల స్టాల్స్ ఏర్పాటు చేసినా ఉదయం పాల్గొన్న భక్తులతో కొంత ఖాళీఅయ్యాయి. దేవస్థానం తరపున 3లక్షల మంచినీరు ప్యాకెట్లను పీఆర్వో విభాగం అందుబాటులో ఉంచారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ వాకీటాకీల ద్వారా సమాచారం తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. మార్గమధ్యలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలందించారు.

శోభాయమానంగా పంపా హారతులు

కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి పంపా హారతుల కార్యక్రమం శోభాయామానంగా జరిగింది. రాత్రి 6.30 గంటలకు స్వామి,అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ పంటుపై ఆశీనులు గావించారు. నదీమతల్లికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అర్చకస్వాములు పంపానదికి ఏడు రకాలైన ఏకహారతి, నేత్రహారతి, బిల్వహారతి, సర్పహారతి, కుంభహారతి, నక్షత్ర హారతి, కర్పూరహారతి ఇచ్చారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనంతో ముగిసింది.ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ పాల్గొనగా వైదికకార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి రుత్విక్‌లు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి నిర్వహించారు.

స్తంభించిన ట్రాఫిక్

గిరియాత్రకు తరలి వచ్చిన భక్తులతో ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టారు. పంపాతీరం వద్ద ప్రదక్షిణయాత్ర ముగిసింది. ప్రత్యేక మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి చతుర్వేద పండితుల వేదస్వస్తి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఉదయం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది



జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

ఈ ఏడాది ముందు జాగ్రత్తలతో మధ్యాహ్నం గిరియాత్ర చేపట్టాలనే ఆలోచన సత్ఫలితాలు ఇచ్చాయి. ఆలయ ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ ఉదయం పల్లకీలో స్వామి,అమ్మవార్లకు మధ్యాహ్నం భక్తులతో సత్యరథం గిరియాత్ర చేపట్టారు. గిరియాత్ర విజయవంతంతో సిబ్బందిని ఈవో, ఛైర్మన్లు అభినందించారు. స్టాల్స్ ఏర్పాట్లు సూపరెంటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పర్యవేక్షణలో తలుపులయ్య, గణపతి ఏర్పాటు చేశారు.

జ్వాలాతోరణం ఇలా..

కార్తీకపౌర్ణమి సందర్భంగా కొండదిగువన తొలిపావంచా వద్ద జ్వాలాతోరణం కార్యక్రమం వేడుకగా జరిగింది. పంపా హారతుల తరువాత స్వామి,అమ్మవార్లను తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. ఇరువైపులా ఎండుగడ్డితో తోరణాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం అర్చకస్వాముల వేదమంత్రాల నడుమ తోరణానికి నిప్పంటించారు. వాటి మధ్యలో పల్లకీలో స్వామి, అమ్మవార్లను ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. ఈ సందర్భంగా తోరణంనుంచి జ్వాల అనంతరం వెలువడిన భస్మం కోసం భక్తులు పోటీపడ్డారు. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను జాతీయ రహదారి మీదుగా మళ్లించారు.



నింగి.. వంగి! నింగి వంగిందా..? అన్నట్టుగా ఆకాశంలో సప్తవర్ణాల హరివిల్లు కనిపిస్తోంది కదూ.. ప్రకృతిలో ఎన్నో అందాలు.. వాటిలో ఇంద్రధనస్సు అత్యద్భుతం.. కాకినాడ జిల్లా తేటగుంట హైవే వద్ద శుక్రవారం ఉదయం కనువిందు చేసిన ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. -ఫొటోగ్రాఫర్, కాకినాడ

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

- డిసెంబరు 9 వరకు అవకాశం
- ఓటు దరఖాస్తుకు గెజిటెడ్ సంతకం అవసరం లేదు
- ఓటరు వెరిఫికేషన్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటు నమోదుకు డిసెంబరు 9వతేదీ వరకు అవకాశం ఉందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటు నమోదుకు డిగ్రీ జిరాక్స్ పత్రాలను ఇచ్చే సమయంలో గెజిటెడ్ సంతకం అవసరం లేదన్నారు. ఓటరు వెరిఫికేషన్‌కు బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు తనిఖీ అధికారికి ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్‌ను చూపించాలన్నారు. లేనిపక్షంలో అప్పుడు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ పత్రాన్ని ఇవ్వాలన్నారు. పదో తరగతి చదివిన తర్వాత ఇంటర్మీడియట్ చదవకుండా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు కూడా ఓటు నమోదు చేసుకునేందుకు అర్హత ఉందన్నారు. ఈనెల 23న ఓటర్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరుగుతుందన్నారు. వచ్చేనెల 30న ఓటర్ల తుది జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఓటుకు ఇప్పటివరకు 2,96,643 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 4064, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 62,862, తూర్పుగోదావరి జిల్లానుంచి 58,561, ఏలూరుజిల్లానుంచి 41196, కాకినాడ జిల్లానుంచి 62200, పశ్చిమగోదావరి జిల్లానుంచి 67760 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఓటు నమోదు జరుగుతుందన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడం గొప్ప బాధ్యత

- నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి
- మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర సమగ్ర శిక్ష పీడీ, ఆర్జేడీ



చాగంటి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీ శ్రీనివాసరావు, ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడం గొప్ప బాధ్యతని నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్రసమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు, ఆర్జేడీ జి.నాగమణి శుక్రవారం చాగంటి దంపతులను కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని గోశాల సమీపంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుడిగా తనను నియమించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తన పదవీ కాలంలో విద్యార్థి లోకానికి సత్ప్రవర్తన, మంచి నడవడిక, నైతిక విలువలతో నేర్పే కర్తవ్యాన్ని తనకు అప్పగించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారని, త్వరలో విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్‌ను కలుస్తామని చెప్పినట్లు పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

ఇక పుష్కలంగా ఉచిత ఇసుక

- వేమగిరి, తీపర్రు-3 రీచ్‌లను జిల్లాకు కేటాయించిన ప్రభుత్వం
- కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలుల్లో స్టాక్ యార్డులు
- 24 నుంచి ఇసుక అందుబాటులోకి..
- కాకినాడ రూరల్, పెద్దాపురంల్లో టన్ను ఇసుక రూ.600
- గొల్లప్రోలు యార్డులో టన్ను రూ.582
- కాకినాడ జిల్లా కలెక్టర్ వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి జిల్లాలో పుష్కలంగా ఇసుక లభించనుందని, కాకినాడ జిల్లాకు తూర్పుగోదావరి జిల్లాలోని వేమగిరి, తీపర్రు-3 రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లా అయిన తూర్పుగోదావరి జిల్లాలోని కడియం మండలంలో ఉన్న వేమగిరి రీచ్‌ను, పెరవలి మండలంలో తీపర్రు-3 రీచ్‌ల్లో ఇసుక కాకినాడ జిల్లాకు కేటాయించారన్నారు. ఈ రీచ్‌ల్లో ఉన్న ఇసుకను కాకినాడ జిల్లాలో ప్రజల అవసరాల నిమిత్తం తరలించి తీసుకొస్తామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలుల్లో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికోసం రీచ్ ఆపరేటింగ్ ఏజెన్సీలను ఖరారు చేశామన్నారు. ఇసుక స్టాక్ యార్డు నిర్వహణకు ఏజెన్సీల టెండర్లు పిలిచి ఈనెల 22తేదీకి లైసెన్సులు ఖరారు చేస్తామన్నారు. ఈ తర్వాత ఈనెల 24, 25 తేదీలకు స్టాక్ యార్డులలో ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. వినియోగదారులు నిర్మాణాల నిమిత్తం ఇసుకను రీచ్‌లనుంచి గానీ, స్టాక్ యార్డుల నుంచి గానీ పొందవచ్చునన్నారు. ఇసుక తవ్వకం, రవాణా, నిల్వల నిర్వహణకు అయ్యే ఖర్చులను మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. టన్ను ఇసుకను కాకినాడ, పెద్దాపురం స్టాక్ యార్డుల్లో రూ.600గా, గొల్లప్రోలు యార్డులో రూ.582గా నిర్ణయించామన్నారు.

వినియోగదారులు నేరుగా ఇసుకను ఎస్ఎఎన్‌డీ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఏపీ శాండ్ మేనేజ్ మెంట్ సిస్టమ్ వెబ్‌పోర్టల్ నుంచి తమ ఆధార్ వివరాలతో బుక్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుక్ చేసుకునే విధానాన్ని ఆయన వివరించారు. ఆఫ్‌లైన్ అంటే స్వయంగా ఇసుక రీచ్‌ల దగ్గర నుంచిగానీ, ఇసుక స్టాక్ యార్డుల వద్దకు వెళ్లి తగిన సొమ్ములు చెల్లించి ఇసుకను పొందవచ్చునన్నారు. తీపర్రులో లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.96, వేమగిరిలో లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.61.30 అవుతుందన్నారు. లోడింగ్, రవాణా, స్టాక్‌యార్డు సెక్యూరిటీ, సీసీ కెమేరాల నిర్వహణ వంటికి అన్నింటికి వ్యయం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో టన్ను రూ.600లకు రెండు యార్డులలో, టన్ను రూ.582కి ఒక యార్డులో వినియోగదారులకు లభిస్తుందన్నారు. జిల్లాలో భవన నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలు, ఇతర నిర్మాణాలు నిలిచిపోకుండా ఉండాలనే లక్ష్యంతో ఉచిత ఇసుకను అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇసుక పొందే క్రమంలో ఏమైనా ఇబ్బందులుంటే తమను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, సమాచారశాఖ డీడీ నాగార్జున పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా సత్యదేవుడి సన్నిధి

- రూ.1.20 కోట్లు ఆదాయం



ఆలయంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పౌర్ణమి సందర్భంగా సత్యదేవుడి సన్నిధి శుక్రవారం భక్తజనసంద్రంగా మారింది. స్వామివారి దర్శనానికి గురువారం రాత్రికే చేరుకున్న భక్తులకు 10గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించి 12:30కి వ్రతాలు ప్రారంభించారు. ఒకపక్క గిరిప్రదక్షిణకు హాజరైన భక్తులు, స్వామివారి వ్రతమాచరించేందుకు విచ్చేసిన భక్తులతో ఎక్కడ చూసినా భక్తజన సమూహమే కనిపించింది. కార్తీకపౌర్ణమి రోజున స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.1.20కోట్ల ఆదాయం లభించింది. అధికారులు చేపట్టిన ముందస్తుచర్యలు సత్ఫలితాలనిచ్చాయి. శుక్రవారం ఒక్కరోజు 9,995 వ్రతాలు జరిగాయి. ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచియున్నారు.

కేన్సర్ వ్యాధి తాళలేక మహిళ ఆత్మహత్య

- కాలువలో దూకి బలవన్మరణం
- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ఘటన



కాలువలో మృతదేహం

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలులోని పిండాల రేవులో కొట్టుకు వస్తున్న ఒక మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కనుగొన్నారు. మృతదేహాన్ని బయటికి తీసుకువచ్చి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మృతురాలి కుమార్తె వచ్చి తనతల్లి బుద్దాల నాగశ్రీ(50) రెండేళ్లుగా కేన్సర్‌తో బాధ పడుతోందని, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తనకు చివరిసారిగా ఫోన్ చేసి అన్నయ్యను జాగ్రత్తగా చూసుకోమని ఫోన్ చేసి పెట్టేసిందని, ఇంటికి వెళ్లి చూడగా ఆమె కనిపించలేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదని చెప్పింది. బిక్కవోలు పిండాల రేవు వద్ద ఒక మృతదేహం ఉందని తెలిసి రావడంతో ఆమె తన తల్లిగా గుర్తించింది. దీంతో పోలీసులు మృతదేహానికి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



గోకవరం పోలీస్‌స్టేషన్‌లో మొక్కనాటుతున్న ఐజీ అశోక్‌కుమార్

కోరుకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూదాలు, గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన నార్త్‌జోన్‌పరిధిలోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, గోకవరం పోలీస్‌స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు పెద్దఎత్తున జరగాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలే కాకుండా ప్రైవేట్ వ్యక్తులను ప్రోత్సహించి ఎక్కువ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జూదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపట్ల స్థానిక పోలీసులు సరిగా స్పందించకపోతే స్పెషల్ ప్రొటెక్షన్ టీంలు రంగంలోకి దిగుతాయన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసులు నమోదు చేస్తే స్థానిక పోలీసులపై చర్యలు తీసుకుంటామన్నారు. జూదాలు, పేకాట, కోడిపందేలు, గంజాయి రవాణా, ఇతర మాదక ద్రవ్యాల రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, నార్త్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ టి.దేవకుమార్, సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

పాలంగిలో చండీహోమం, రుద్రయాగం

పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

ఉండ్రాజవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో నెలటూరుకు చెందిన ఉమారామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 15వరకు అష్టవాజపేయ మహాయాగం సందర్భంగా జరిగిన చండీహోమం, రుద్రయాగ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆఖరి రోజైన శుక్రవారం పాల్గొన్నారు. కుంకుమ పూజలు, దీపోత్సవం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. యాగ నిర్వాహకుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలు అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి

వ్యక్తి ఆత్మహత్య

శృంగవరపుకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాసకాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం నార్కేడిమిల్లి గ్రామానికి చెందిన సీహెచ్ నాగేంద్ర శ్రీనివాస కాలనీలో ఉంటున్నాడు. అతని భార్య గర్భవతి కావడంతో పుట్టింటికి వెళ్లింది. కొన్నాళ్లుగా ఆయన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. నాగేంద్ర భార్య శుక్రవారం ఉదయం నుంచి ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో ఎస్.కోటలో వేరేచోట ఉన్న బంధువులకు చెప్పింది. దీంతో వారు ఇంటికి వచ్చి పిలిచారు. తలుపులు కొడితే తెరవలేదు. కిటికిలో నుంచి చూస్తే నాగేంద్ర ఉరేసుకుని కనిపించాడు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వీఎస్ మూర్తి తెలిపారు. భార్య, అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు.

పట్టువస్త్రాలు పంపిన డిప్యూటీ సీఎం పవన్

పాదగయ, మహాసంస్థానంలో సమర్పణ... ప్రత్యేక పూజలు

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి,అమ్మవార్లకు, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్టువస్త్రాలు సమర్పించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలంతా శాంతి, సౌభాగ్యాలతో సుభిక్షంగా ఉండాలని... రాష్ట్రానికి, పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటూ ఆయన ఈ పట్టువస్త్రాలను ప్రత్యేకంగా పంపారు. పవన్ పంపిన పట్టువస్త్రాలను పాదగయక్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవార్లకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు పవన్ పంపిన పట్టువస్త్రాలను మర్రెడ్డి శ్రీనివాసరావు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించి వాటిని స్వామికి అలంకరించారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టువస్త్రాలను తీసుకువెళ్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో పవన్ పంపిన పట్టు వస్త్రాలు తీసుకువెళ్తున్న మర్రెడ్డి శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

బిర్సా ముండాకు ఘన నివాళి


బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో బిర్సా ముండా ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయారని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బిర్సాముండా జయంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జార్ఖండ్ రాష్ట్రం కుంతీ జిల్లా ఉలిహతు గ్రామంలో 1875 నవంబరు 15న బిర్సా ముండా జన్మించారన్నారు. బిర్సా 1894 అక్టోబరు1న ముండాలను సమీకరించి బ్రిటీష్ వారి నుంచి పన్ను మాఫీకి ఉద్యమాన్ని ప్రారంభించారని చెప్పారు. పేదల పక్షాన నిలబడి పలు పోరాటాలు చేసారని గుర్తుచేశారు. 1900 ఫిబ్రవరి 3న బ్రిటీష్ వారు అరెస్టు చేయగా అదేఏడాది జూన్ 9న బిర్సా ముండా తుది శ్వాస విడిచారని చెప్పారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.

బాలలు మంచి ప్రవర్తనతో మెలగాలి

ఎల్ఐసీ ఎస్‌డీఎం సంధ్యారాణి


బాలలకు బహుమతి ప్రదానంలో ఎల్ఐసీ ఎస్‌డీఎం సంధ్యారాణి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బాలలు చెడు అలవాట్లకు దూరంగా మంచి ప్రవర్తనతో మెలగాలని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు కె. సంధ్యారాణి పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా ఎస్‌కేవీటీ స్కూల్లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఎల్ఐసీ ప్రవేశపెట్టిన గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఎందరో విద్యార్థులు లబ్ధి పొంది విద్యలో ఉన్నత స్థాయికి వెళ్లారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ మార్కెటింగ్ మేనేజరు సత్యనారాయణ సాహు, సేల్స్ మేనేజరు బి శ్రీనివాసు, రూరల్ బ్రాంచ్ మేనేజరు డీఎస్వీ సూర్యనారాయణ, ఏబీఎం బి.అబ్రహాం, బీఎం రామ్మోహన్, ఎల్ఐసి ఉద్యోగుల ప్రెసిడెంట్ మాథ్యూస్, హెచ్ఎం ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే వైద్యపరీక్షలు

రంగంపేట పీహెచ్‌సీ డాక్టర్ వేణుశ్రీలక్ష్మి



రంగంపేట పీహెచ్‌సీలో వైద్య సేవలు ప్రారంభిస్తున్న దృశ్యం

రంగంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే ఇంటింటికీ వెళ్లి వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నేషనల్ కమ్యూనికబుల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగామ్(ఎన్‌సీడీసీడీ 3.0), రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లను రంగంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ సచివాలయాల్లో ఉన్న ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో వ్యాధుల నియంత్రణ, అవగాహన పెంచడం ద్వారా ఆరోగ్య సేవల ప్రభావాన్ని మెరుగుపరుస్తారన్నారు. ఇంటి వద్దనే బీపీ, షుగర్ పరీక్షలు చేస్తారని, కేన్సర్ స్క్రీనింగ్ చేయడం, కేనర్స్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే 18 ఏళ్ల లోపు పిల్లల్లో వ్యాధులను గుర్తించడానికి, చికిత్స అందించడానికి విస్తృత సేవలు అందిస్తా రని వేణుశ్రీలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.చిన్నారావు, కె.సంకీర్తన, సీహెచ్‌వో కె.జయమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద రాబట్టాలి

ఉండ్రాజవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యో తి): చెత్త నుంచి సంపదను రాబట్టాలని మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం వడ్లూరులోని ఎస్‌డబ్ల్యూఎమ్ షెడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను సేకరించినపుడు వాటిలో వచ్చే వ్యర్థాలను వేరు చేసి వాటిని విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హర హర శంకర!

- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు
- మహిళల కేదారేశ్వర నోములు
- శివాలయాల వద్ద దీపోత్సవాలు
- భక్తులతో ఆలయాలు కిటకిట


కోరుకొండలో విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం దృశ్యం

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు భక్తుల శివ పంచాక్షరి నామ స్మరణతో ప్రతిధ్వనించాయి. కుటుంబ సభ్యులందరూ ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం కేదారేశ్వర నోములు నోచి శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకుని అనంతరం నోముల దగ్గర వుంచిన బూరెలను ప్రసాదంగా తీసుకుని ఉపవాస దీక్షను విరమించారు. మండలంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయం లో స్వామికి లక్ష బిల్వార్చన, పార్వతి అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు జరిపారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

దివాన్‌చెరువు: సంపత్‌నగరంలోని పర్వతవర్ధినీ సమేత నాగేశ్వరస్వామి ఆలయం వద్ద దీపోత్సవం నిర్వహించారు. శివలింగం, స్వస్తిక్, ఓంకారం, శంఖు, చక్రాలు, తిరునామం ఆకారాలల్లో లక్షదీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు స్వామివారికి విశేషపూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలను వెలిగించారు. ఇదిలా ఉండగా పాతతుంగపాడు, దివాన్ చెరువు, సంపత్‌నగరం గ్రామాల్లోని శివాలయాలు వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. పరమశివుడి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి తోరణం కింద నుంచి మూడుసార్లు ఊరేగించారు. పల్లకి వెంట భక్తులు తిరిగారు. జ్వాలాతోరణం కాలిపోగా మిగిలిన గడ్డిని కొందరు తీసుకొచ్చి తమ ఇళ్లలో భద్రపర్చు కున్నారు. ఈ గడ్డి ఎక్కడ ఉంటే అక్కడ సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం


బిక్కవోలులో గోలింగేశ్వరుడు


సంపత్‌నగరంలో దీపోత్సవం


పెదరాయవరంలో దీపాలంకరణ

రాజానగరం: మండలంలోని తూర్పుగోన గూడెం, చక్రద్వారబంధం, కానవరం, పల్లకడియం, నరేంద్రపురం, నందరాడ గ్రామాల్లోని శివాలయాలతో పాటు నియోజకవర్గ కేంద్రమైన రాజా నగరంలోని శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీరాజలింగేశ్వ రస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. దీనిలో భాగం ఏర్పాటు చేసిన జ్వాలాతోరణ వేడుకలను భక్తులు తిలకించారు. అనంతరం గడ్డి రక్ష కోసం ఎగబడ్డారు. అలాగే చక్రద్వారబంధం శివాలయంలో ఆవునేతి ఒత్తులతో దీపాన్ని వెలిగించి భక్తులకు జ్యోతిదర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని దేవాదాయ అగస్తేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే రామ పాదాల రేవులో గోదావరి స్నానం ఆచరించిన భక్తులు స్వామి వారి దర్శనానికి క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో 365 ఒత్తులు వెలిగించి బ్రాహ్మణులకు దానాది కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి నోములు నోచుకున్న భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. రాత్రి ఆలయంలో స్వామి అమ్మవార్లను పల్లకిలో ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు. వైశ్య సంఘ నాయకులు గ్రంధి జగన్నాధం, బ్రాహ్మణ సంఘం నుంచి మంగళంపల్లి శేఖర్‌శాస్త్రి, కాపు పెద్ద మెండ సీతారామయ్య జ్వాలాతోరణం నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్లు నంది వాహనంపై గ్రామంలో ఊరేగారు. జ్వాలాతోరణం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధవళేశ్వరం సీఐ టి.గణేష్ పర్యవేక్షణలో సిబ్బంది, బందోబస్తు నిర్వహించారు.

కోరుకొండ: స్థానిక విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయం చుట్టూ భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కొత్తగా వివాహితలు శివాలయంలో పువ్వు పిండి, గుమ్మడికాయ, కంద మొక్కలు దానాలు ఇచ్చారు. అలాగే దీప, సాలగ్రామ, ఉసిరికాయ దానాలు అర్చకులకు అందజేశారు. విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం వైభవంగా జరిగింది. స్వామి వారు ప్రత్యేక పల్లకిలో జ్వాలాతోరణం ఉత్సవంలో పాల్గొన్నారు. జంబుపట్నంలో విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం ఉత్సవం జరిగింది. కణుపూరు కొండపై స్వయంభు మల్లికార్జున స్వామి ఆలయం వద్ద, గాదరాడ ఓం శివశక్తి పీఠంలోని తారకేశ్వరస్వామి ఆలయం, శ్రీరంగపట్నం, కోటికేశవరం, రాఘవాపురం, దోసకాయపల్లి, బూరుగుపూడి, బుచ్చింపేట శివాలయాలకు భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు.

రంగంపేట: పెదరాయవరంలో శ్రీ రాజారాజేశ్వరి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, 108 దీపాలంకరణ, శివనామస్మరణ జరిపారు.

అనపర్తి: అనపర్తిలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉమా రామలింగేశ్వరస్వామి, దరణికోట శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించారు.


ధవళేశ్వరంలో భక్తులతో కిక్కిరిసిన అగస్తేశ్వరస్వామి ఆలయం

పట్టభద్రులు తప్పక ఓటు నమోదు చేసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి పట్టభద్రుడు తప్పక ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగి ఉండాలని రాష్ట్ర బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులో శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటురు నమోదు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. పలువురు పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకున్నారు. ఈ నెల 20వ తేదీతో ఓటరు నమోదు గడువు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ ఎల్‌వీ.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బి జార్జి ఆంటోని, మేడిశెట్టి తాతబ్బాయి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానాభివృద్ధి


కొంకుదురులో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో జ్ఞానం మరింత వృద్ధి చెందుతుందని కొంకుదురు గ్రంథాలయాధికారి ఎస్.బాల అన్నారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య స్వగ్రామమైన కొంకుదురు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల రెండో రోజైన శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాధికారి బాల పుస్తకాల ప్రాముఖ్యత, వాటిని చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయంలో వున్న పుస్తకాలను వివరించి అనంతరం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

రాజానగరం:స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి ఆదిత్య యూనివర్శిటీ గ్రంథాలయాధి కారి సోమరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని, గ్రంథాలయాల్లోని పుస్తకాలను ఉపయోగించుకుని విజ్ఞానవంతులుగా ఎదగాలన్నారు. మరో ముఖ్య అతిథి స్థానిక ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ సతీష్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి సమాజాన్ని నిర్మించాలన్నారు. అలాగే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక విద్యార్థులు, బీడీసీ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
పలుచోట్ల పుస్తక ప్రదర్శన


రాజానగరంలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న అతిథులు


పాతతుంగపాడులో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

కనకదుర్గమ్మకు సామూహిక కుంకుమ పూజలు

దివాన్‌చెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత తుంగపాడు గ్రామంలో కొలువై ఉన్న దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ప్రతినెలా పౌర్ణమికి అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయని అర్చకులు అయిలూరి శ్రీనివాస్ తెలిపారు. కార్తీకపౌర్ణమి శుక్రవారం కలసి రావడంతో 800 మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారు'

దివాన్‌చెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజకీయ నాయకులు, పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని కొండగుంటూరుకు చెందిన సామాజిక కార్యకర్త పెంటగట్ల మణికుమార్ శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆరోపించారు. మండలంలో ఏదొక గ్రామంలో జనవాణి నిర్వహిస్తూ, బ్యానర్లలో రాజకీయ నాయకుల ఫొటోలు వేస్తున్నారన్నారు. గ్రామాలలో ఉన్న రాజకీయ నాయకుల బ్యానర్లను సైతం మండల అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా మండలంలోని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు.

రేపు కమ్మ మహాజనుల కార్తీక వన సమారాధన

రాజానగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కాకతీయ అసోసియేషన్ ఫర్ మ్యాన్ కైండ్ మోరల్స్ అండ్ ఎచీవ్‌మెంట్ ఆధ్వర్యంలో 17న చక్రద్వారబంధం గ్రామంలో కమ్మ మహాజనుల కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ చక్రద్వారబంధం నుంచి మేడపాడు వెళ్లే రోడ్డులో ఆదివారం ఉదయం 7 గంటలకు పూజలు ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కమ్మ సంఘీయులంతా కార్తీక వన సమారాధలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.


మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణారెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న 108 సిబ్బంది

సమ్మె నోటీసు అందించిన 108 సిబ్బంది

అనపర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే 108 వ్యవస్థను నిర్వహించి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ అనపర్తి 108 సిబ్బంది శుక్రవారం ఎమ్‌పీడీవో ఎమ్.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్‌లకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో 108 సిబ్బంది డి.మురళీకృష్ణ, ఆదినారాయణ, డి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు


వేమగిరి శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కడియం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణలో మహిళలు దీపారాధన చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆయా ఆలయాల వద్ద బ్రాహ్మణులకు స్వయంపాకం అందజేశారు. సాయంత్రం మహిళలు ఇళ్ల వద్ద పూజలు జరిపి చంద్రుడిని దర్శించుకున్నారు. మండలంలో కడియం, వేమగిరి, వీరవరం, దుళ్ల, కడియపులంక, పొట్టిలంక, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు శివాలయాల్లో భక్తులు కార్తీకపౌర్ణమి పూజలు జరిపారు. ఆయా ఆలయాల వద్ద కార్తీకపౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం జరిపారు.

ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డికి నల్లమిల్లి శుభాకాంక్షలు


శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, తెలంగాణ టీడీపీ అధికార ప్రతినిధి జ్యోత్స్న

అనపర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, అడ్వకేట్ జీవీ రెడ్డికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ హెడ్ ఆఫీస్‌లో ఆయనను కలిసిన నల్లమిల్లి దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో తెలంగాణ టీడీపీ అధికార ప్రతినిధి జ్యోత్స్న ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

అనపర్తి నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు రూ.1.77కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో అధ్వాన్నంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు ఇప్పటికే రూ.2.50 కోట్లు మంజూరు చేసిందని దీనికి అదనంగా మరో 1.77 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్థనరెడ్డిలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.


డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డ్రగ్స్‌పై అవగాహన

సీతానగరం, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌పై లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన నిర్వహించారు. శుక్రవారం సీతానగరం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, డ్రగ్స్ వల కలిగే అనర్థాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.శివకుమార్, జి.అశోక్ కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లిలో ఇంటి పరిసరాల పరిశీలన

సీతానగరం, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ఏవీకె చైతన్య ఆధ్వర్యంలో జరిపారు. వెదుళ్ళపల్లి గ్రామంలో ఎంపీహెచ్ ఈఓ వై.సుబ్బారాయుడు వైద్య సిబ్బంది అక్కడి ప్రాంతా లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కె.కావేరి, ఏఎన్ఎం ఎస్.ప్రశాంతి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

నర్సరీ రైతు మార్గానికి సత్కారం

కడియం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కడియపులంక వీరహనుమన్ నర్సరీ అధినేత, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు శుక్రవారం సత్కరించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా 106వ వార్షికోత్సవం శుక్రవారం రాజమహేంద్రవరం సూర్యగార్డెన్స్‌లో జరిగాయి. దీనికి మార్గాని సత్యనారాయణను బ్యాంకు అధికారులు ఆహ్వానించి సత్కరించారు. బ్యాంకు లావాదేవీల్లో ఆయన ఉత్తమ రైతు అని యూబీఐ రీజనల్ మేనేజర్ విశ్వేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సుబాష్ ఉన్నారు.

కాంగ్రెస్‌పార్టీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్‌గా కొండ్రాజు

కడియం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్‌గా బుర్రిలంక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాడాల కొండ్రాజు నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి నుంచి తనకు ఉత్తర్వులు వచ్చాయని కొండ్రాజు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.





రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో పూజలు

వేడుకగా సత్యదేవుడి గిరి ప్రదక్షిణ





అన్నవరం సత్యదేవుడి గిరి ప్రదక్షిణ వేడుకగా సాగింది.. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి గిరి ప్రదక్షిణ నిర్వహించారు.. సుమారు 1.50 లక్షల మంది భక్తులు హాజరైనట్టు సమాచారం. శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ చేపట్టారు. మధ్యాహ్నం గిరిప్రదక్షిణ నిర్వహించగా సత్యరథం వెంబడి భక్తులు భారీగా కదిలారు. సత్యదేవుడి వెంట నడిచారు. కొండంతా సత్యదేవ నామ స్మరణతో మారుమ్రోగింది.. 9.2 కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ సాగింది.. స్వామి వెంట తొలుత ఎంత మంది ఉన్నారు.. గిరిప్రదక్షిణ ముగిసే సమయనికి అంతకు రెట్టింపు భక్తజనం తరలివచ్చారు.. రాత్రి పంపా హారతుల కార్యక్రమం కన్నుల పండువగా సాగింది.



కార్తీక సందడి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పుస్కరించుకుని గోదావరి ఘాట్లకు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే కార్తీక స్నానాలను ఆచరించి దీపాలు వదిలారు. కోటిలింగాలరేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, మార్కండేయ ఘాట్, దోబిఘాట్ , సరస్వతి ఘాట్,గౌతమిఘాట్, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలకు శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు పోటెత్తారు. అనంతరం ఘాట్లలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. రేవులు కార్తీక దీప కాంతులతో వెలుగొందింది. భక్తులు రాజమహేంద్రవరంలో కుటుంబసమేతంగా పౌర్ణమి నోములను నోచుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు పెట్టుకున్నారు. హరహర మహాదేవ అంటూ భక్తితో శివయ్యను కొలిచారు.

ఫ్యాన్స్..గల్లంతు!





(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఫ్యాన్ గాలి మారింది.రెక్కలు ఒక్కొక్కటిగా ఎగిరిపోతున్నాయి.. జిల్లాలో వైసీపీ ఖాళీ అయిపోతుంది.. ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లో ఫ్యాన్ రెక్కలు విరిగిపడ్డాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి ఉంది. అవకాశం వస్తే జారుకునేందుకు నేతలు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వైసీపీ డీలా పడింది. ఎన్నికల తర్వాత అనేక మంది వైసీపీని వీడిన సంగతి తెలిసిందే.అయితే ఇప్పటి వరకూ జిల్లాలో చోటా మోటా నాయకులే కూటమి బాట పట్టారు. గురువారం ఏకంగా ప్రముఖ పారిశ్రా మిక వేత్త,గత వైసీపీ ప్రభుత్వంలో సలహాదా రు గా వ్యవహరించిన ఎస్.రాజీవ్‌కృష్ణ టీడీపీలో చేరడంతో అంచనాలు తారుమారయ్యాయి. స్థానిక ఎన్నికలు వచ్చేలోపు వైసీపీ ఖాళీ అయిపోతుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

వైసీపీ నుంచి క్యూ

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైసీపీలో వివిధస్థాయిల్లో పనిచేసిన నేతలు తెలుగు దేశం, జనసేన, బీజేపీల్లో చేరడానికి అనేక ప్రయ త్నాలు చేస్తున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో స్థానికంగా నెలకొన్న రాజకీయాల వల్ల కూట మిలో నేతలే అంగీకరించని పరిస్థితి ఉంది. అయితే ఇప్పటికీ ఆయా నేతలు టచ్‌లో ఉన్నట్టు సమాచారం. కొవ్వూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే దివంగత పెండ్యాల కృష్ణబాబు అల్లుడైన ఎస్.రాజీవ్‌కృష్ణ టీడీపీలో చేరడంతో ఇక వైసీపీ పరిస్థితి ఏంటనేది చర్చనీయాంశమైంది. ఆయనతో పాటు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పార్టీ మారడంతో కార్యకర్తలు కూటమి వైపే చూస్తున్నారు. రాజమహేంద్రవరంలో 2014లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన బొమ్మన రాజ్‌కుమార్ తనయుడు బొమ్మన జయకుమార్ కొద్ది నెలల కిందటే టీడీపీలో చేరడంతో పాటు జాంపేట కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ చైర్మన్‌గా కూడా ఎన్నికయారు.అంతకుముందు చల్లా శంకరరావు కూడా కూటమి మద్దతుతో ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ అయిన సంగతి తెలిసిందే. అనపర్తి నియోజకవర్గంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆ నియోజకవర్గంలోనూ పార్టీ అంతంత మాత్రంగానే ఉంది. గోకవరం జడ్పీటీసీ దాసరి శ్రీరంగ అధికారికంగా టీడీపీలో చేరకపోయి నప్పటికీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతోనే కలసి ఉంటున్న సంగతి తెలిసిందే. కోరుకొండ మండలంలోని కాపవరం సర్పంచ్‌జాజుల రాము టీడీపీలో చేరారు. దేవరపల్లిలో వైసీపీ నేత మాధవరపు వెంకటేశ్వరరావు జనసేనలో చేరారు. పోతుల కనకరాజు జన సేనలో చేరారు. అదే బాట లో కొవ్వూరు, నిడదవోలు మునిసిపల్ చైర్మన్లు ఉన్నా రు. ఇంకా చాలా నియోజకవర్గాల నుంచి వైసీపీ నేతలు టీడీపీలో చేరే ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు నేతలు గాంభీర్యత ప్రదర్శిస్తున్నప్పటికీ వారికి ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే ఇంకా వైసీపీ గురించి మాట్లాడుతున్నారనే చర్చ కూడా మొదలైంది. వైసీపీ వైఖరికి విసిగి పోయిన ప్రజలు జగన్, వైసీపీకి ఇక భవిష్యత్ లేదనే వాదన చేస్తున్నారు. ఎన్నికల తర్వాత జిల్లావ్యాప్తంగా కొందరు మౌనంగా ఉండిపోయారు. సుమారు ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలు దిశగా ముందుకు వెళ్లడంతో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది.ఈ నేపథ్యంలో ఇక తమకు రాజకీయ భవిష్యత్ ఉండదనే కారణంతో పలువురు వైసీపీ నేతలు కూటమి వైపు చూస్తున్నారు.

కూటమి వైపు.. వైసీపీ నేతల క్యూ

- కూటమిలో చేరేందుకు సిద్ధం
- టచ్‌లో ఉంటున్న వైసీపీ నేతలు
- కొవ్వూరు, నిడదవోలులో షాక్
- అనపర్తిలోనూ పెరిగిన చేరికలు
- అదే బాటలో మరికొందరు
- నిడదవోలులో జనసేన వైపు?
- తూర్పున ఫ్యాన్ పని ఖాళీ

అయితే స్థానిక కూటమి నేతలు మాత్రం తమకు తెలియకుండా చేరికలు జరుగుతుండడంపై కినుక వహిస్తున్నారు.గత సంఘటనల నేపథ్యంలో సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

నిడదవోలులోనూ వైసీపీకి షాక్

- పార్టీకి 11 మంది రాజీనామా
- చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు
- జిల్లా అధ్యక్షుడికి లేఖలు
- జనసేనలో చేరేందుకు సిద్ధం?
- పెరగనన్ను జనసేన బలం



చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు నియోజకవర్గంలోనూ వైసీపీకి షాక్ తగిలింది. నిడదవోలు మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,మరో తొమ్మిది మంది కౌన్సిలర్లు శుక్రవారం సాయంత్రం వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు పంపారు. వివిధ కారణాల వల్ల తామంతా వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామని ఆమోదించాలని తమ లేఖ ద్వారా విన్నవించారు. అయితే తర్వాత ఏ పార్టీలో చేరుతున్నది వెల్లడించలేదు. జనసేనలో చేరనున్నట్టు సమాచారం. నిడదవోలు 25 వార్డు కౌన్సిలర్ మున సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, 4వ వార్డు కౌన్సిలర్ మునిసిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, 3,7,9,10,11,18,23,24,28 వార్డుల కౌన్సిలర్లు వరుసగా ఎం.డి.షాజీరాబేగం, ముంగంటి మాణిక్యమాల, ఉసురుమర్తి జాన్ బాబు,ఆరుగొల్లు వెంకటేశ్వర్లు,చిలకల శారదా దేవి,సైదు చంద్రశేఖర్,మద్దిపాటి నాగశ్రీ, మానుపాటి లక్ష్మి, ఆకుల ముకుందరావు తమ రాజీనామా లేఖలను జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణకు పంపారు. వైసీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు విధానాలతో గత కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న మునిసిపల్ చైర్మన్ మరి కొందరు కౌన్సిలర్లు వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆంధ్రజ్యోతి ముందే కథనం ప్రచురించింది. ఇప్పుడు అదే నిజమైంది. మునిసిపల్ పాలకవర్గం వైసీపీని వీడడంలో జనసేన నాయ కుడు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కీలకపాత్ర పోషిం చినట్టు సమాచారం. త్వరలోనే మిగిలిన వైసీపి కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసే దిశగా ప్రణా ళిక సిద్ధం చేసినట్టు తెలిసింది.

కౌన్సిల్‌లో తగ్గిన వైసీపీ బలం

నిడదవోలు పురపాలక సంఘానికి 2021లో ఎన్నికలు జరగ్గా 27 వార్డుల్లో వైసీపీ అభ్యర్థులు ఒక వార్డులో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో 27 మంది సభ్యులు ఉన్న వైసీపీలో నేడు 11 మంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేయడంతో 16 మందికి వైసీపీ బలం పడిపోయింది. త్వరలో మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు రాజీనామా బాట పట్టనుం డడంతో అతి త్వరలోనే నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ జనసేన పార్టీ కైవసం చేసుకోనుంది.



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణు

కూటమిలో చేరితే పదవులకు రాజీనామా చేయాలి : వైసీపీ

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీ పీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు తమ పదవులకు రాజీనామాచేయాలని వైసీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీని వీడిన వారంతా వైసీపీలో ఉంటూ గత ఎన్నికల్లో టీడీపీకి పని చేశారని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రాజీవ్‌కృష్ణ ప్రభుత్వ సలహాదారుడిగా ఉండి పార్టీని వీడి వెళ్లడం ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఏ కారణాలతో రాజీవ్ కృష్ణ పార్టీని వీడారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.ఈకార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, యు. సురిబాబు, పి. శ్రీలేఖ, ఎన్. శ్రీనివాస్, జి. సాయి, వి. సూరిబాబు,ఆలీ తదితరులు పాల్గొన్నారు.

షోలాపూర్ ఉల్లి వచ్చినా..లొల్లి!

- మహారాష్ట్ర ఉల్లి నో స్టాక్
- కొత్త ఉల్లి ధరలకు రెక్కలు
- మార్కెట్లో కిలో రూ.80 పైనే
- భారీగా పెరుగుతున్న రేట్లు
- సామాన్యుల బెంబేలు



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర పాత ఉల్లిపాయలు మార్కెట్‌లో దొరకడంలేదు. హోల్‌సేల్ ట్రేడర్లు నో స్టాక్ అని చెబుతున్నారు. రేటు ఎంతైనా కొందామని ప్రయత్నిస్తున్నా చాలా మంది ఎగువ మధ్యతరగతికి ఇవి అందుబాటులో లేకుండా పోయాయి. మహారాష్ట్ర నుంచి సరుకు రావడం లేదని, లారీలు ఎప్పుడొస్తాయో తెలియదని ఇక్కడి ట్రేడర్లు చేతులెత్తేస్తున్నారు.ఒకరిద్దరు హోల్‌సేల్ ట్రేడర్లు ధైర్యం చేసి రెండు, మూడు లారీలు రప్పిస్తున్నా వాటిని సెమీహోల్‌సేల్,సూపర్ మార్కెట్లు హాట్‌కేకుల్లా పట్టుకుపోతున్నారు. మధ్యతరగతి ప్రజలకు అందనీయడంలేదు. దీంతో షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలకు సెమీ హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఈ రకం ఉల్లి ఏ మాత్రం నిల్వ ఉండకపోయినా ధర మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా ఉంది. నాణ్యత అంతంతమాత్రంగా ఉండి, నిల్వకు ఏ మాత్రం పనికిరాని షోలాపూర్ రకం ఉల్లిపాయలను హోల్‌సేల్‌లోనే కిలో రూ.45 నుంచి రూ.50ల వరకూ విక్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక సూపర్‌మార్కెట్లు, సెమీ హోల్‌సేల్ వ్యాపారుల వద్ద అరకొరగా దొరికే పాత ఉల్లిపాయలు కిలో రూ.80పైనే విక్రయిస్తున్నారు. దీంతో బహిరంగ మార్కెట్లో ఉల్లి ధరలు సామాన్యులతో పాటు మధ్యతరగతి వర్గాలను బెంబేలెత్తిస్తున్నాయి. రైతు బజార్లలో ఉల్లిపాయలు కిలో రూ.32లకు విక్రయిస్తున్నారు. కొంతమంది కర్నూలు రకం,మరికొందరు షోలాపూర్ ఉల్లిపాయలు విక్రయిస్తున్నా రు. ఇవి చాలా నాసిరకంగా ఉంటున్నా సామాన్య ప్రజలకు మరోదారి లేక కొనుగోలు చేస్తున్నారు.

కార్తీకమాసంలోనూ ఇలాగెందుకు..

దీపావళి తర్వాత మార్కెట్లోకి మహారాష్ట్ర కొత్త ఉల్లిపాయలు వస్తాయని, దీంతో ధరలు తగ్గుతాయని హోల్‌సేల్ ట్రేడర్లు చెబుతూ వచ్చారు. అనుకున్నట్టే షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఇదే సమయంలో కర్నూలు ఉల్లిపాయలు వచ్చినా మార్కెట్‌పై ఏ మాత్రం ప్రభావం చూపించలేదు. పరిస్థితి తారుమారైంది. మహారాష్ట్ర నాసిక్‌రకం పాత ఉల్లిపాయలు మార్కెట్‌కు రాకపోవడంతో నిల్వకు ఏ మాత్రం పనికిరాని షోలాపూర్ ఉల్లి ధరలు టాప్ రేటులో ఉన్నాయి. ట్రేడర్ల అంచనాలకు భిన్నంగా ధరలు మరింత పెరగడం ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఉల్లి వినియోగం గణనీయంగా తగ్గుతుందని భావించినా ఆ పరిస్థితి కనిపించడంలేదు. ధరలు ఏ మాత్రం దిగిరావడంలేదు. ఈ పరిస్థితి ఎన్నాళ్లు ఉంటుందనే దానిపై హోల్‌సేల్ ట్రేడర్లు సైతం చెప్పలేకపోతున్నారు. దీంతో సామాన్యులు, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఉల్లిపాయలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

మహిళల రక్షణకు ప్రత్యేక టీమ్‌లు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



గోకవరంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

గోకవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో మహిళలు,చిన్న పిల్లల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జివిజి.అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా గోకవరం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఉమెన్, మేల్ కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీమ్‌లను మహిళల రక్షణకు ఏర్పాటు చేశామన్నారు.ఏజెన్సీ ముఖద్వారం తూర్పు గోదావరి జిల్లా ఉండడంతో గంజాయి అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందన్న సమాచారం ఉందన్నారు.గంజాయి అక్రమ రవాణా నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. సోషల్ మీడియా ద్వారా అసభ్యకరమైన పోస్టులు పెడితే ఊరుకునేది లేదన్నారు. రేంజ్ పరిధిలో ఉన్న ఆరు జిల్లాల్లో ఇప్పటి వరకు సుమారు 60 వేల నుంచి 70 వేల వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మరో 30 వేల కెమెరాలు ఏర్పాటు చేస్తే కేసుల్లో మంచి పురోగతి లభించే అవకాశం ఉంటుందన్నారు. నిందితుల ముఖాలను గుర్తు పెట్టే కెమెరాలు త్వరలో రానున్నాయని, వాటి వల్ల కూడా పోలీస్ వ్యవస్థకు మరింత మేలు జరగనుందన్నారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గోకవరం ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పునఃప్రారంభించారు. ఎస్ఐ పవన్ కుమార్ నుంచి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దేవిచౌక్ సెంటర్‌లో కనకదుర్గ అమ్మవారిని ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఆయన వెంట ఏఎస్పీ సుబ్బరాజు,సీఐ వై.సత్యకిషోర్ ఉన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి!



కోళ్ల ఫారాలకు తరలింపు

- రెండు చోట్ల సాగుతున్న దందా
- మామూళ్ల మత్తులో అధికారులు
- చూడనట్టు వదిలేస్తున్నవైనం

నిడదవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల శాఖ మంత్రి ఎంత ప్రయత్నించినా రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉన్నాయి. ఎందుకంటే అన్నీ తెలిసినా అధికార యంత్రాంగం కళ్లు మూసుకుని ఉండడమే. గ్రామాల్లో బియ్యం ఎవరెవరు కొంటారు.. ఎక్కడికి తరలిస్తారనేది జనమెరిగిన సత్యం.. అయినా అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. గ్రామాల్లో పదుల సంఖ్యలో సచివాలయ సిబ్బంది ఉన్నా పక్కదారి పట్టడాన్ని ఆపలేకపోతున్నారు. రేషన్ బియ్యం చాలా మంది ఇంట్లో వినియోగించడానికి ఇష్టపడరు. ఈ నేపథ్యంలో అయిన కాడికి అమ్ముకుని సొమ్ములు చేసుకుంటు న్నారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం ఇవ్వడానికి కేజీకి రూ.43లు ఖర్చు చేస్తుంటే ప్రజలు మాత్రం కేజీ రూ.17లకు విక్రయించడం గమనార్హం. కొన్ని వేల టన్నుల బియ్యం మళ్లీ ఏమవుతున్నాయోనని ఆరాతీస్తే అసలు విషయం బయటపడింది. కొందరు ఈ ఉచిత బియ్యం కొనుగోలు చేసి అధిక ధరలకు కోళ్ల ఫారంలకు విక్రయించేస్తున్నారు. పేదల బియ్యం పక్కదారి పడుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తయినా చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు రేషన్ బియ్యం దందాను కుటీర పరిశ్రమగా మార్చేసి కొనుగోళ్లను యథేచ్ఛగా సాగించేస్తున్నారు.

దళారుల కొనుగోళ్లు..

జిల్లాలో ప్రతినెలా 1వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఎండీయూ వాహనాల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు ఉచితంగా ప్రభుత్వం బియ్యం పంపిణీ చేస్తుంది. కుటుంబంలో ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. సుమారు ఒక్కో కుటుంబానికి 20 కిలోలలోపుగా బియ్యం పంపిణీ జరుగుతుంది. తెల్లరేషన్ కార్డుదారుల్లో ఎక్కువ మంది రేషన్ బియ్యాన్ని వినియోగించరు. తెల్లరేషన్ కార్డు ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం కావడంతో తప్పని పరిస్థితుల్లో బియ్యం తీసుకుంటున్నారు. దీంతో కొందరు రేషన్ బియ్యాన్ని తెల్లరేషన్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించేస్తున్నారు. నిడదవోలు మండలంలోని సూరాపురం, చాగల్లు మండలంలోని కలవలపల్లి ఇలా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో కొందరు రేషన్ బియ్యం కొనుగోలు విక్రయాలను కుటీర పరిశ్రమగా నిర్వహిస్తున్నారు. ఉచితంగా వచ్చే రేషన్ బియ్యం కిలో 17 రూపాయల చొప్పున కొనుగోలు చేసిన అక్రమార్కులు కిలో రూ.23లకు కోళ్ల ఫారాలకు, కొన్ని రైస్ మిల్లులకు విక్రయించేస్తున్నారు. కోళ్ళ ఫారా ల్లో కోళ్లకు ఆహారమైన నూక ధర పెరిగి ఎక్స్‌పోర్ట్‌కు వెళ్లిపోవడంతో కొందరు యజమానులు రేషన్ బియ్యం కొనుగోలుకు తెరలేపారు. ప్రతి నెలా మొదటి 15 రోజులు రేషన్ బియ్యం కొనుగోలు చేసిన వారు మూటలు కట్టుకుని మోటారు సైకిళ్లపై కోళ్ల ఫారమ్‌లకు తరలించేస్తున్నారు. రేషన్ బియ్యం కోళ్ల ఫారమ్‌కు చేరిన క్షణాల్లోనే నూకగా మారిపోతుండడంతో విక్రయించే వారికి కొనుగోలు చేసే వారికి ఎటువంటి సమస్యలు తలెత్తడం లేదు. రేషన్ బియ్యం కొనుగోలు చేసే దళారులు అధికారులకు ఎప్పటికప్పుడు మామూళ్లు ఇస్తున్నట్టు సమాచారం. అందుకే అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ పూజలు

పాలంగిలో రుద్రయాగం

8

పోసానిని అరెస్టు చేయాలి

దేవరపల్లిలో టీడీపీ నాయకుల నిరసన


దేవరపల్లిలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళీని అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరపల్లిలో మూడురోడ్ల సెంటర్ వద్ద ఆందోళన నిర్వహించి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, నల్లజర్ల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీచౌదరి మాట్లాడుతూ పోసాని కృష్ణమురళీ గతంలోనూ చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ పైన అనుచిత వ్యాఖ్యలు చేశారని, తన నోరుకు అడ్డూ అదుపు లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడారని ఇప్పుడు బీఆర్.నాయుడిపై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయనను అరెస్టు చేయాలన్నారు. పోసానికి వ్యతిరేకంగా అతని చిత్రపటాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పులూరి రాంబాబు, కాకర్ల జగదీష్, బళ్లా సూర్యచక్రం, అడబాల మణికంఠ, కంబాల సత్తిబాబు, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ దుర్గారావు పుట్టినరోజు


దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ కేవీకే దుర్గారావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆధ్వర్యంలో ఆయన కేక్ కట్ చేశారు. ఆయనకు సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తాను నిత్యం ప్రజల మధ్య ఉంటూ మండల పరిషత్ నిధులతో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, నరహరశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎన్‌వీ రమణ, జడ్పీటీసీ స్వర్ణలత, కూచిపూడి సతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, కొర్లపాటి అరుణ, పాల్గొన్నారు.

సెపక్‌తక్రా జిల్లా సబ్‌జూనియర్స్ ఎంపికలు


చపక్‌తక్రా జిల్లా జట్టుకు ఎంపికైన బాలబాలికలు

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సబ్‌జూనియర్స్ సెపక్‌తక్రా బాలురు, బాలికల ఎంపికలు శుక్రవారం దేవరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. పీఈటీ ఓరుగంటి నాగరాజు మాట్లాడుతూ సెపక్‌తక్రా పోటీల్లో 50మంది బాలబాలికలు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26, 27 తేదీల్లో కర్నూల్ జిల్లా నందికొట్కూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను రామన్నపాలెం ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ అభినందించారు.

పాలంగిలో రుద్రయాగం

పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ


పూజాకార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

ఉండ్రాజవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి గ్రామంలో నెలటూరుకు చెందిన ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి 15వరకు ఆప్తవాజపేయ మహాయాగం సందర్భంగా జరిగిన చండీహోమం, రుద్రయాగ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆఖరి రోజైన శుక్రవారం పాల్గొన్నారు. కుంకుమ పూజలు, దీపోత్సవం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. యాగ నిర్వాహకుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలు అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

యూటీఎఫ్ నల్లజర్ల నూతన కార్యవర్గం


నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న విజయగౌరి

నల్లజర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.వి జయగౌరి అన్నారు. శుక్రవారం నల్లజర్ల జడ్పీ హైస్కూల్లో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె ఎన్నికల అధికారిగా వ్యవహరించగా కమిటీ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్ఎఫ్ ఆలీ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షుడు టి.నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు పీవీ అప్పారావు, మహిళ అధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా బి.కిషోర్, కోశాధికారి జి.కృష్ణ బాలాజీ, కార్యదర్శులుగా ఎం.విజయ్, డి.మోహన్‌రాజు, టీటీ స్వాతి, ఎస్.వీర్రాజు, ఉమామహేశ్వరావు, జయచంద్ర, రాజేష్, రేణుక, మరో 10 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. విజయగౌరి నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న లీలా సంతోషి

గోపాలపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్లో బాల్యవివాహాలపై వ్యాసరచన, బాలికా విద్యపై వక్తృత్వ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రాజమండ్రి ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. కొవ్వూరుపాడులోని అల్లూరి బాపినీడు జడ్పీ హైస్కూల్ చెందిన 10వ తరగతి విద్యార్థి మడ్డెల్లి ప్రగతి డివిజన్ స్థాయిలో మొదటి స్థానం, కనుమూరి లీలాసంతోషి ద్వితీయ స్థానం సాధించారు. వీరి ద్దరికీ కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

రహదారుల అభివృద్ధికి నిధులు

నిడదవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గంలో రోడ్లు భవనాల శాఖ పరిధిలో నాలుగు రహదారుల అభివృద్ధికి రూ.2.61 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోనే నిడదవోలు నియోజకవర్గాన్ని అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతోనే తాను పనిచేస్తున్నానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంతో తాను పనిచేయడం ఆనందంగా ఉందన్నారు.

పోలవరం ప్రాజెక్టు డీఈ రాజేశ్వరరావుకు సత్కారం



చాగల్లు, నవంబరు 15: విద్యార్థులు చదువులో ప్రోత్సహిస్తున్న పోలవరం ప్రాజెక్టు డీఈ ఎన్‌పీ రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు. బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు ఆయన ఆర్థిక సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఈని పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వెంకట రామారావు, న్యాయవాది కోడి శ్రీనివాసరావు సత్కరించారు. హెచ్ఎం ఎస్‌కే కరీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

శంభో..శివ శంభో..

- శివ నామస్మరణతో మారుమోగిన గోష్పాదక్షేత్రం
- గోదావరి నదిలో పుణ్యస్నానాలు
- కార్తీక పౌర్ణమి పూజలు
- సాలగ్రామ, దీప దానాలు


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


గోష్పాదక్షేత్రంలో శివ లింగానికి అభిషేకం

పెరవలి: అన్నవరప్పాడులో స్ఫటికలింగం

గోష్పాదక్షేత్రంలో నదిలో దీపం వదులుతున్న భక్తురాలు

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పవిత్ర గోదావరి తీరం కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తజన సందోహంగా మారింది. శివ నామస్మరణతో క్షేత్రమంతా మారుమోగింది. అధిక సంఖ్యలో గోష్పాదక్షేత్రానికి చేరుకుని అఖండ గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టంలోని శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పల్లో నేతి దీపాలను వెలిగించి నదిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని శివ, కేశవులను, సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. రావిచెట్టు వద్ద నాగశిలలకు నదీ జలాలు, పాలతో అభిషేకించారు. ప్రధాన స్నానఘట్టం, తులసి చెట్టు, రావిచెట్ల వద్ద సుందరేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రాహ్మణులకు సాలగ్రామ, దీప దానాలతో పాటు స్వయంపాకం దానం చేశారు. అలాగే మండలంలోని వాడపల్లి, ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి, పెనకనమెట్ట, ధర్మవరం, దొమ్మేరు, మద్దూరు, వేములూరు, తోగుమ్మి గ్రామాలలోని శివాలయాల్లో భక్తులు కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు.

జ్వాలాతోరణం..

గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు ప్రదోషకాలంలో క్షేత్రానికి చేరుకుని కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం సుందరేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. జ్వాలాతోరణం వెలిగించి ఉత్సవమూర్తులతో పాటు భక్తులు ప్రదక్షిణలు చేశారు. అలాగే స్నానఘట్టంలో కాశీ విశ్వేశ్వరుని వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

కార్తీక వనసమారాధన

రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలో గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రకృతి రావణబ్రహ్మ బ్రహ్మసూత్ర శివాలయం 7వ వార్షికోత్సవాన్ని భక్తులు నిర్వహించారు. శ్రీ శివభక్త రావణబ్రహ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శివాలయంలో కార్తీక వనసమారాధన జరిపారు. శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో స్ఫటికలింగ దర్శనం

పెరవలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించుకున్నారు. ఉదయం గోదావరి, కాలువల్లో స్నానాలు ఆచరించి శివాలయాలను దర్శించుకున్నారు. మధ్యాహ్నం వైష్ణవ తదితర ఆలయాలను దర్శించుకున్నారు. అన్నవరప్పాడులో స్ఫటికలింగ దర్శనం సందర్భంగా తెల్లవారుజాము నుంచి లైన్లలో ఉండి పలువురు భక్తులు తమ చేతులతో స్పర్శ దర్శనం చేసుకున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయం కార్తీక పౌర్ణమికి ప్రత్యేకం. ఈ ఆలయంలో కార్తీక మాసంలో దశమి నుంచి పౌర్ణమి వరకూ పూజలు చేసి పౌర్ణమి రోజున స్వామివారికి కల్యాణం, హోమాలు నిర్వహించి తిరునాళ్ల ప్రారంభిస్తారు. శుక్రవారం స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

పోతవరంలో జ్వాలాతోరణం

నల్లజర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం-కవులూరు గ్రామాల మధ్య ఉన్న ఉమాలింగేశ్వరస్వామి ఆలయం నుంచి పోతవరం పురవీధుల్లో పల్లకిలతో స్వామి వారిని ఊరేగిస్తూ, గడ్డితో మంటలు వ్యాపింపజేసి జ్వాలతోరణం నిర్వహించారు. గడ్డి సగం కాలిన తరువాత గ్రామస్తులు ఇళ్లకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాపా శ్రీనివాస్, మోతుకూరి శ్రీనివాస్, గద్దె నరసింహమూర్తి, ప్రతిపాటి అమ్మిరాజు, విస్సాకోటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు శివాలయాల్లో కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు జరిపారు. పాలంగి, చివటం శివాలయాలు వద్ద జ్వాలా తోరణం నిర్వహించారు. స్వామివారిని గ్రామాల్లో ఊరేగించారు.

గోదావరిమాతకు మహానీరాజనం

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో గోదావరిమాతకు మహానీరాజనం అందజేశారు. ముందుగా క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలోని గోదావరి మాతకు, గౌతముడు, గోవుకు అష్టోత్తర శత నామ కుంకుమార్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల హారతులు సమర్పించారు. తదుపరి దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గోదావరి నీరాజన సమితి సభ్యులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వేగేశ్వరపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బారులుదీరిన భక్తులు


ఉండ్రాజవరంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న దృశ్యం


నల్లజర్ల: పోతవరంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న దృశ్యం

టీడీపీ సభ్యత్వ నమోదు



నిడదవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి ఆవిర్భవించిన పార్టీ టీడీపీ అని పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిడదవోలులోని 1,2, 26 వార్డుల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే వెన్నుముక అని, ప్రతి కార్యకర్తకు భద్రత కల్పించే ఏకైక పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి సత్యనారాయణ, ఎస్‌కే పాతిమా, భాస్కరభట్ల రాజారామ్ మోహన్‌రాయ్, కొమ్ము వంశీకృష్ణ, ప్రత్తిపాటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

పెరవలి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కొత్తపల్లిలో నిర్మించిన సిమ్మెంటు రోడ్డు పనులను అధికారులు పరిశీలించారు. డ్వామా పీడీ అనంత ఉమామహేశ్వరరావు, ఏపీడీ డి.రామకృష్ణ, బండారు బాబి, బర్రే దొరస్వామి, బలుసు శ్రీనివాస్, తాతారావు పాల్గొన్నారు. పనులు నాణ్యతగా చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

చెత్త నుంచి సంపద రాబట్టాలి

ఉండ్రాజవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను రాబట్టాలని మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం వడ్లూరులోని ఎస్‌డబ్ల్యూఎమ్ షెడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను సేకరించినపుడు వాటిలో వచ్చే వ్యర్థాలను వేరు చేసి వాటిని విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు.. కౌన్సెలింగ్

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన మహిళను పట్టణ పోలీసులు రక్షించారు. శుక్రవారం కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జిపై రాజమహేంద్రవరం మోరంపూడి గణేష్‌నగర్‌కు చెందిన ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అటుగా వెళ్తున్న సీఐ విశ్వం గమనించి ఆమెను పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో భర్తకు సమాచారం అందించారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోకూడదని ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించినట్టు సీఐ తెలిపారు.

సమగ్ర నివేదిక తయారు చేయండి

కొవ్వూరు డీఎల్‌డీవో స్లీవారెడ్డి

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ


గోపాలపురంలో జాతీయ నాయకులకు నివాళులు

గోపాలపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై క్షేత్రస్థాయి సిబ్బంది సమగ్ర నివేదిక తయారు చేయాలని డీఎల్‌డీవో స్లీవారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ అధికారులు, మండల సమాఖ్య గ్రామసంఘాల అధ్యక్షులు, ఆయా శాఖల అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ముందుగా బీఆర్ అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం స్లీవారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులకు అనుగుణంగా ప్రణాళికలను తయారు చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న మౌలిక వసతులతో పాటు ఆ పరిసరాల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రత్నం, ఏ.వెంకట్రావు, సతీష్‌కుమార్, సోమరాజు, పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా సంఘాల గ్రామాధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక మండల పరి షత్ కార్యాలయంలో జరిగిన కా ర్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు అబ్జర్వర్ ఎస్.శ్రీనివాసరావు, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు డైరెక్టర్ జి.రమణ, జిల్లా ప్రణాళిక, వనరుల కమిటీ సభ్యులు ప్రసంగిరాజు, డీఎల్‌డీవో సెల్వారెడ్డి గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంపై శిక్షణను అందజేశారు. అన్నిశాఖలు సమన్వయంతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారుచేయాలని ఎంపీడీవో కె.సుశీల సూచించారు. కార్య క్రమంలో ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్‌యూ శర్మ, పం చాయతీరాజ్ ఏఈ త్రిమూర్తులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సతీష్ పాల్గొన్నారు.


కొవ్వూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల

యువత చెడుకు దూరంగా ఉండాలి

కొవ్వూరు ఎంవీఐ శివప్రసాద్

పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు


చాగల్లు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండేటట్లు చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైనే ఉందని కొవ్వూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) కేవీ శివ ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. అనంతరం డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం ప్రమాదకరమని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల ప్రభావం మెదడు, నరాలపై పడి అనారోగ్యం పాలవుతారన్నారు. అనంతరం విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాల యాధికారి జీవీవీఎన్ త్రినాథ్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఈవోపీఆర్డీ శ్రవణ్‌కుమార్ ప్రారంభించారు. యువత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రాణించేందుకు పుస్త క పఠనం దోహదం చేస్తుందన్నారు. గ్రంథాలయాధికారి గద్దె శ్రీని వాసరావు, వీవీ రామారావు, కోడి నాగేశ్వరరావు, ఆత్కూరి రామారావు పాల్గొన్నారు. అనం తరం మాదక ద్రవ్యాలు, యువత తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ జరిగింది. చంద్రవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను గ్రంథాలయ సంస్థ జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుందుల వీరభద్రరావు ప్రారంభించారు. పుస్తకాలతో ఎక్కువ సమయం గడపాలన్నారు. సచివాలయ కార్యదర్శి సుజాత, ఇంజనీరింగ్ సిస్టెంట్ గోపి, గ్రంథాలయాధికారి సుమన్ కుమార్ పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని తీపర్రు, ముక్కామల, పెరవలి గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన జరిగింది. అలాగే మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో కరుటూరి గోపాలకృష్ణ, లైబ్రేరియన్లు వీహెచ్‌వీ జయలక్ష్మి, వెంకటేశ్వర్లు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రకాష్ సోని, అసిస్టెంట్ మేనేజర్ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను లైబ్రేరియన్ ఏవీ రమణ వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ గుదె సుశీల, పాఠకులు పాల్గొన్నారు.


పెరవలి: ముక్కామల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

సోమేశ్వరాలయంలో కోటి దీపోత్సవం



నిడదవోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీకాకోశపు లక్ష్మీనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలు వెలిగించారు.

వివాహితపై కట్నం వేధింపులు

కొవ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త అతడి కుటుంబ సభ్యులపై కేసునమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. కొవ్వూరుకు చెందిన చెరుకూరి నాగ సౌజన్యకు గద్దె వెంకట సురేంద్రతో 2018లో వివాహమైంది. ఆ సమయంలో కట్నం కింద రూ.10 లక్షలు, 45 కాసుల బంగారం, రెండున్నర ఎకరాల పొలం, రూ.లక్ష ఆడపడుచు కట్నం కింద అందజేశారు. వీరికి పాప పుట్టింది. కొంతకాలం తరువాత సురేంద్ర, మద్యానికి అలవాటుపడ్డాడు. భర్త, అత్త, ఆడపడుచులు అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేస్తున్నారని సౌజన్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.